# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - మంగళవారం 6 మే 2025 | సంపుటి:9 | సంచిక:130 | పేజీలు:8+4 | వెల: రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM


## కాలినడక భక్తుల కోసం కరెంటు బస్సులు



2

## నీట్ రాసిన తల్లీబిడ్డలు



2

# పాక్‌కు నీళ్లు, నిధులు బంద్

### సలాల్ డ్యామ్ నుంచి నీటి సరఫరా నిలిపివేత

### పాకిస్తాన్‌కు నిధులివ్వొద్దని ఏడీబీకి భారత్ విజ్ఞప్తి

### దాయాది దేశ ఆర్థిక వెన్ను విరుస్తున్న మోడీ ప్రభుత్వం



**ఢిల్లీ, మే 5:** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ తమపై సైనిక దాడులను చేయొచ్చన్న ఆలోచనతో దాన్ని ఎదుర్కోవడానికి సిద్ధమవుతున్న పాకిస్తాన్‌కు మోడీ ప్రభుత్వం ఊహించని దెబ్బకొట్టింది. సైనిక పరమైన దాడులకన్నా ముందు ప్రజా జీవనానికి, దేశ మనుగడకు కీలకమైన ఆర్థిక మూలాలను దెబ్బకొట్టే చర్యలకు ఉపక్రమించింది. దానితో ఏం చేయాలో? వీటిని ఎలా ఎదుర్కోవాలో తెలియని పాక్ అతలాకుతలం అవుతోంది. దీనిలో ...మిగతా 2లో

## కుదేలవుతున్న పాక్ ఆర్థిక వ్యవస్థ

### అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ మూడీస్ వెల్లడి



**న్యూయార్క్, మే 5:** ప్రస్తుత ఉద్రిక్తతల ప్రభావం పాకిస్థాన్‌పై ప్రతికూలంగా ఉంటుందని ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ మూడీస్ పేర్కొంది. భారత్‌తో ఉద్రిక్తతలు కొనసాగితే అవి.. పాక్ ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీస్తాయని ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ మూడీస్ హెచ్చరించింది. ఈ మొత్తం వ్యవహారంలో భారత్‌తో పోల్చుకంటే అదే తీవ్రంగా నష్టపోతుందని విశ్లేషించింది. వృద్ధి రేటు మందగించడం.. నిధుల సేకరణకు పాక్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల్లో ఇబ్బందులు వంటివి తలెత్తుతాయని వెల్లడించింది. పాకిస్థాన్‌కు అప్పుల లభ్యత పరిమితమైపోవడంతోపాటు.. ...మిగతా 2లో

**మోడీకి పుతిన్ ఫోన్** 6



# ఉపాధి అవకాశాలే లక్ష్యం..



## ష్నైడర్ ఎలక్ట్రిక్ సంస్థతో ఏపీ ఒప్పందం

**అమరావతి:** ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఎనర్జీ, నిర్మాణ రంగాల్లో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకొని యువతకు ఉపాధి అవకాశాలు పెంచడమే లక్ష్యంగా విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ చొరవతో ష్నైడర్ ఎలక్ట్రిక్ సంస్థ ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, ష్నైడర్ ఎలక్ట్రిక్ ఇండియా ఫౌండేషన్ ప్రతినిధులు ఎంవోయూపై సంతకాలు చేశారు. ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఎనర్జీ, నిర్మాణ రంగాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయి అవకాశాలను అందుపుచ్చుకునేందుకు ప్రతిభావంతులైన బందాలను తయారు చేయడమే ఈ ఒప్పందం లక్ష్యం. దీని ప్రకారం ప్రభుత్వ ఐటీఐలు, పాలిటెక్నిక్ కళాశాలలు, ఎన్ఏసీ శిక్షణా కేంద్రాల్లో 20 అధునాతన ట్రైనింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయనున్నారు.

పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా ప్రపంచస్థాయి ప్రమాణాలతో 9వేల మంది యువతకు శిక్షణ ఇస్తారు. శిక్షణా పరికరాలు, వినియోగ వస్తువులు, డిజిటల్ సామగ్రి కోసం ష్నైడర్ ఎలక్ట్రిక్ ఇండియా ఫౌండేషన్ సుమారు రూ.5 కోట్లు ఖర్చుచేయనుంది. మంగళగిరిలో రూ.15 కోట్లతో ఎలక్ట్రిక్ సెంటర్ ఏర్పాటుకు ష్నైడర్ అంగీకారం తెలిపింది. అంతేకాకుండా అనంతపురంలో రీసెర్చ్ సెంటర్ ఏర్పాటుకు ముందుకొచ్చింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ష్నైడర్ ఎలక్ట్రిక్ మోడ్రన్ పవర్ ఆప్టిమైజేషన్ పైలట్ ప్రాజెక్టు చేపట్టనుంది. మరోవైపు అడ్వాన్స్‌డ్ కోర్సుల్లో శిక్షణ కోసం ఒరాకిల్‌తో ప్రభుత్వం కీలక ఒప్పందం కుదుర్చుకుంది. ఒరాకిల్ మై లెర్న్ ప్లాట్‌ఫామ్ ద్వారా మూడేళ్లలో 4లక్షల మందికి శిక్షణ ఇవ్వనున్నారు. ఈమేరకు మంత్రి లోకేశ్ సమక్షంలో ఒరాకిల్, ఏపీఎస్ఎస్‌డీసీ మధ్య ఎంవోయూ కుదిరింది.



## మోడీతో రాహుల్ భేటీ

**ఢిల్లీ, మే 5:** ప్రధాన మంత్రి నరేంద్రమోడీతో కాంగ్రెస్ అగ్రనేత, పార్లమెంట్ లో విపక్ష నేత రాహుల్ గాంధీ భేటీ అయ్యారు. ప్రధాని కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో సీబీఐ డైరెక్టర్ ఎంపికపై చర్చ జరిగినట్టు సమాచారం. అటు, పహల్గాం దాడికి సంబంధించి పాకిస్థాన్ తో అనుసరించాల్సిన విషయాలపై కూడా వీరిద్ధరి మధ్య చర్చ జరిగిందని అధికార వర్గాల విశ్వసనీయ సమాచారం. వీటితో పాటు పలు కీలక అంశాలు కూడా ఇరువురు నేతల మధ్య చర్చకు వచ్చినట్టు తెలుస్తోంది.

# ఈ నెలలోనే 'అన్నదాత సుఖీభవ'

### తెదేపా నేతలతో టెలికాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు



**అమరావతి:** 'అన్నదాత సుఖీభవ' పథకాన్ని ఈ నెలలోనే ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. కడపలో 27, 28, 29 తేదీల్లో మహానాడు జరగనున్న నేపథ్యంలో ఈ నెల 18వ తేదీ నాటికి రాష్ట్ర స్థాయి కమిటీలు మినహా మిగిలిన అన్ని కమిటీలూ వేయాలని సూచించారు. మహానాడు తర్వాత రాష్ట్ర కమిటీలు వేయనున్నట్లు వివరించారు. రాజధాని పునర్నిర్మాణ కార్యక్రమం విజయవంతం కావడంతో ప్రపంచం దష్టి అమరావతి మీదకు మళ్లిందన్నారు. ఆదివారం తెదేపా ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ కార్యవర్గంతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి మాట్లాడారు. జూన్ 12వ తేదీకి కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఏడాది అవుతుందని, ఇప్పటి వరకూ ప్రభుత్వం చేసిన సంక్షేమ, అభివద్ధి కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ''గుజరాత్ మోడల్ రాష్ట్రంలోనూ అమలవ్వాలి. సుస్థిర ప్రభుత్వం ఉండటంతో గుజరాత్ వేగంగా అభివద్ధి చెందుతోంది. ప్రభుత్వానికి ఇచ్చినంత ప్రాధాన్యం పార్టీకీ ఇస్తున్నాం. ఏడాది పాలనలోనే స్పష్టమైన మార్పు చూపించి ప్రజలకు నమ్మకాన్ని కలిగించాం'' అని చంద్రబాబు పేర్కొన్నారు.

**ముందే 'తల్లికి వందనం'**

'తల్లికి వందనం' కింద చదువుకునే పిల్లలకు పాఠశాలల ప్రారంభానికి ముందే రూ.15 వేల చొప్పున అందజేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ''సామాజిక న్యాయం పాటిస్తూ పదవులు ఇస్తున్నాం. ఇప్పటికే మెజార్టీ కార్పొరేషన్లకు ఛైర్మన్లు, డైరెక్టర్లు, ఏఎంసీ ఛైర్మన్ పదవులు భర్తీ చేశాం. మిగిలిన నామినేటెడ్ పోస్టులూ త్వరలో భర్తీ చేస్తాం'' అని చంద్రబాబు వివరించారు.

**ఎన్నో చేశాం.. ప్రజల్లోకి తీసుకెళ్లండి..**

''పోలవరానికి నిధులు రాబట్టి 2027 నాటికి ప్రాజెక్టు పూర్తయ్యేలా పని చేయనున్నాం.
ఒకటో తేదీనే పింఛన్ల అందజేస్తున్నాం.
16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చాం.'దీపం-2' కింద కోటి మందికిపైగా లబ్ధిదారులకు 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నాం. ఇలా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలుచేస్తున్నాం.'' అని వివరించిన చంద్రబాబు.. వీటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని నేతలకు సూచించారు.

## జాగ్తే రహో

### పౌరులను సమాయత్తం చేయండి

### 7న సివిల్ మాక్ డ్రిల్స్ నిర్వహించండి

### రాష్ట్రాలకు కేంద్రం సూచన

**ఢిల్లీ, మే 5:** పహల్గాం ఉగ్రదాడితో భారత్- పాక్ మధ్య ఉద్రిక్త వాతావరణం కొనసాగుతున్న నేపథ్యంలో దేశ భద్రతలో పౌరుల్ని సమాయత్తం చేసేందుకు రేపు మాక్ డ్రిల్స్ నిర్వహించాలని కొన్ని రాష్ట్రాలకు కేంద్ర హోంశాఖ సూచించింది. భద్రతా సన్నద్ధతపై పౌరులకు అవగాహన కల్పించాలని, అత్యవసర సమయాల్లో ఎలా స్పందించాలో తెలపాలని పేర్కొంది. శత్రు దాడి జరిగినప్పుడు విద్యార్థులు, యువకులు స్వీయరక్షణతో పాటు ఎలా ప్రతిస్పందించాలో అవగాహన ...మిగతా 2లో



## రెండున్నర కేజీల వాసవీమాత బంగారు విగ్రహాన్ని ఆవిష్కరించిన బాలకష్ణ దంపతులు

**అమరావతి:** శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో వార్షికోత్సవం ఘనంగా జరుగుతోంది. ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ చేసి 85 ఏళ్లు గడిచిన సందర్భంగా ఈ వేడుకలను నిర్వహిస్తున్నారు. ఇటీవల రెండున్నర కేజీల బంగారంతో (విలువ సుమారు రూ.3 కోట్లు) తయారు చేసిన వాసవీమాత విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం ఎమ్మెల్యే బాలకష్ణ దంపతులు ఆ విగ్రహాన్ని ఆవిష్కరించి బంగారు పుష్పాలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

## పోలవరం ప్రాజెక్టును సందర్శించిన అంతర్జాతీయ నిపుణుల బందం



**పోలవరం:** పోలవరం ప్రాజెక్టును అంతర్జాతీయ నిపుణుల బందం సందర్శించింది. ఇక్కడ జరుగుతున్న వివిధ నిర్మాణ పనులను వారు పరిశీలించారు. ఈ బందం తగు సూచనలు, సలహాలను జలవనరుల శాఖ అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులకు ఇవ్వనుంది.

అంతర్జాతీయ నిపుణులు రిచర్డ్ డొన్నెల్లి, సీన్ హించ్ బెర్జర్, జియాన్ఫ్రాన్కో డి సికో, డేవిడ్ బి పాల్ ప్రాజెక్టు నిర్మాణ పనులను పరిశీలించారు. వీరితో పాటు పీపీఏ సభ్య కార్యదర్శి ఎం.రఘురాం, కేంద్ర జలసంఘం అధికారులు, సరబ్జిత్ సింగ్ భక్షి, రాకేశ్, అశ్వనీకుమార్ వర్మ, గౌరవ్ తివారీ, హేమంత్ గౌతమ్, సీఎస్ఎంఆర్ఎస్ అధికారులు మనీష్ గుప్తా, లలిత్ కుమార్ సోలంకి పనులు జరుగుతున్న తీరుపై సమీక్షించారు. ప్రాజెక్టు సీఈ కె.నరసింహమూర్తి, ఎంఈఐఎల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సతీష్‌బాబు పనుల పురోగతిని వారికి వివరించారు. నిపుణుల బందం సభ్యులు డయాఫ్రం వాల్ పనులు, ఎగువ కాఫర్ డ్యామ్ పటిష్ఠతపై ఆరా తీశారు.

**కష్ణా నది యాజమాన్య బోర్డుకు ఏపీ ప్రభుత్వం లేఖ**

కష్ణా నది యాజమాన్య బోర్డుకు ఏపీ ప్రభుత్వం లేఖ రాసింది. ఇవాళ్టి త్రిసభ్య కమిటీ సమావేశానికి హాజరు కాలేమని అందులో పేర్కొంది. పోలవరం ప్రాజెక్టు పరిశీలనకు నిపుణులు వస్తున్నారని అందులో వివరించింది. ఈ నెల 10 తర్వాత త్రిసభ్య కమిటీ భేటీ ఏర్పాటు చేయాలని ఏపీ ఈఎన్సీ కోరారు. ఇకపై కష్ణా బోర్డు సమావేశాలు విజయవాడలోనే నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

## వైకాపా పాలనలో రాష్ట్రాభివద్ధి 30 ఏళ్లు వెనక్కి: కొల్లు రవీంద్ర



**సబ్బవరం:** వైకాపా దుర్మార్గపు పాలనలో ఏపీ అభివద్ధి 30 సంవత్సరాలు వెనక్కి వెళ్లిపోయిందని రాష్ట్ర గనులు, భూగర్భ జలాలు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. అనకాపల్లి జిల్లా సబ్బవరంలోని జీఎస్ కళ్యాణమండపంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనిశ్చితి పరిస్థితుల నుంచి రాష్ట్రాన్ని బయటపడేసేందుకు తెదేపా, జనసేన ఒక తాటి మీదకు వచ్చాయన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత చేసిన అభివద్ధి, సంక్షేమ పథకాల గురించి ఆయన వివరించారు. పెందుర్తి నియోజకవర్గంలో తెదేపా కార్యకర్తల్లో నెలకొన్న అనిశ్చితిని గ్రహించానని, పొత్తుల్లో భాగంగా ఇక్కడ జనసేనకు సీటు ఇవ్వాల్సి వచ్చిందని చెప్పారు. ఇక్కడి తెదేపా కార్యకర్తలకు అన్యాయం జరగకుండా చూసుకునే బాధ్యత తనదన్నారు. రాష్ట్రంలో జనసేన, భాజపా, ఎవరి పార్టీని వారు బలోపేతం చేసుకున్నందువల్ల మనం కూడా తెదేపాను బలోపేతం చేసుకోవలసిన ఆవశ్యకత ఉందని చెప్పారు.

## ట్రంప్.. ఇక సుంకాల సినిమా సూపిత్తడట

### అమెరికా వెలుపల నిర్మించే చిత్రాలపై 100 శాతం సుంకాలు

### ఆ దేశంలో ప్రదర్శించే విదేశీ సినిమాలపైనా విధింపు!

### ట్రంప్ టారిఫ్ దెబ్బతో తీవ్ర ఆందోళనలకు గురవుతున్న ప్రపంచ సినిమా రంగం




**ట్రంప్, మే 5:** అధ్యక్ష ఎన్నికల్లో గెలిచిన నాటి నుంచే రోజుకొక్క స్టేట్‌మెంట్‌తో.. శ్వేత సౌధంలో కూచున్న తరువాత పదుల కొద్దీ నిర్ణయాలతో సొంత దేశమైన అమెరికాలోనూ, ప్రపంచ దేశాలలోనూ సంచలనాలు సృష్టిస్తూ వస్తోన్న డొనాల్డ్ ట్రంప్ ఇప్పుడు సినిమాలపై పడ్డాడు. అమెరికా వెలుపల నిర్మించే చిత్రాలపై 100శాతం సుంకాలు విధిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రకటనతో అంతర్జాతీయ సినిమా రంగం ఒక్కసారిగా షేకవుతోంది. మన సినిమాలపైన కూడా ప్రభావం పలు రకాలుగా ...మిగతా 2లో

# ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలె

**పక్కా ప్లానింగ్, పకడ్బందీ ఏర్పాట్లు, కట్టుదిట్టమైన భద్రత కల్పించాలె**

**మిస్ వరల్డ్ పోటీలు తెలంగాణ ఖ్యాతిని చాటి చెబుతాయి**

**లోటుపాట్లు లేని అతిథ్యానికి సౌకర్యాలన్నీ అమర్చాలె**

**పోటీదారులు పర్యాటక ప్రదేశాలు చూసేందుకు రవాణా సౌకర్యాలు కల్పించాలె**

**వాతావరణానికి తగ్గట్టుగా ప్లానింగ్ చేసుకోవాలె**

**విద్యార్థులకు కూడా పోటీలను చూపించాలె**

**అందాల పోటీల నిర్వహణపై ముఖ్యమంత్రి ఉన్నత స్థాయి సమీక్ష**



హైదరాబాద్, మే 5: మిస్ వరల్డ్ పోటీలను ఘనంగా నిర్వహించేందుకు సమగ్ర ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. తెలంగాణ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేయడానికి ఉపయోగపడే మిస్ వరల్డ్-2025 వేడుకలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని, 116 దేశాలకు చెందిన యువతులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని, ఎలాంటి లోటుపాట్లు లేకుండా వారికి ఆతిథ్యమివ్వాలని ముఖ్యమంత్రి సూచించారు. 10వ తేదీ నుంచి 31వరకు జరుగనున్న ఈ ప్రపంచ స్థాయి పోటీల నిర్వహణకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని పోలీసు అధికారులను అప్రమత్తం చేశారు. పోటీదారులతో పాటు దేశ విదేశాల నుంచి ఈవెంట్ కవరేజీకి దాదాపు మూడు వేల మంది మీడియా ప్రతినిధులు హాజరవుతారని సీఎం తెలిపారు. వివిధ దేశాల నుంచి పోటీలకు వచ్చే వారిని తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలతో స్వాగతించాలని, పోటీలు పూర్తయ్యేంత వరకు ఎక్కగా చిన్న పొరపాటు లేకుండా ఏర్పాట్లు ఉండాలని అధికారులను హెచ్చరించారు. పర్యాటక శాఖతో పాటు అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని, అధికారులందరూ సమర్థంగా తమకు అప్పగించిన బాధ్యతలు నిర్వహించాలని ఆదేశించారు.

మిస్ వరల్డ్ 2025 ఏర్పాట్లపై సోమవారం కమాండ్ కంట్రోల్ సెంటర్ లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. సీఎంతో పాటు మంత్రులు జూపల్లి కష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకష్ణారావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, డీజీపీ జితేందర్, సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, రాచకొండ పోలీస్ కమిషనర్ జి.సుధీర్ బాబు, ఏడీజీపీ స్టీఫెన్ రవీంద్రతో పాటు అన్ని విభాగాల ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. మొదటి రోజు నుంచి వరుసగా జరిగే కార్యక్రమాల షెడ్యూలుకు అనుగుణంగా భద్రతా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ప్రతి కార్యక్రమానికి ఒక నోడల్ ఆఫీసర్ ను నియమించాలని సూచించారు. మే 10వ తేదీన సాయంత్రం హైదరాబాద్లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో మిస్ వరల్డ్ ప్రారంభోత్సవం నుంచీ 31వ తేదీన జరిగే గ్రాండ్ ఫినాలే వరకు ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

మిస్ వరల్డ్ పోటీదారులు సందర్శించే ప్రదేశాలకు అవసరమైన రవాణా, వసతులు కల్పించాలన్నారు. ఆయా ప్రాంతాల్లో భద్రత కట్టుదిట్టంగా ఉండేలా చూసుకోవాలన్నారు. అనుకోని అవాంఛనీయ పరిస్థితులు తలెత్తినా వాటిని అధిగమించే ప్రత్యామ్నాయ ప్రణాళికలను అధికారులు రూపొందించుకోవాలని ఆదేశించారు.

మహిళా సాధికారతను చాటిచెప్పేలా రాష్ట్రంలో ఐకేపీ మహిళలు నిర్వహిస్తున్న డ్వాక్రా బజార్ సందర్శనతో పాటు, ఉప్పల్ స్టేడియంలో ఐపీఎల్ సెమీఫైనల్స్ తిలకించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. వాతావరణ సూచనలకు అనుగుణంగా తగిన ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని, ఈదురు గాలులు, వర్షాలు వచ్చినా గ్రేటర్ సిటీ పరిధిలో ఇబ్బందులు తలెత్తకుండా జీహెచ్ఎంసీతో పాటు హైడ్రా విభాగాలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్రంలోని ప్రజా ప్రతినిధులతో పాటు వివిధ రంగాల్లో ప్రముఖులను ప్రభుత్వం తరఫున మిస్ వరల్డ్ ప్రారంభోత్సవానికి ఆహ్వానించాలని సూచించారు.

**విద్యార్థులకు కూడా పోటీలను చూపించాలె..**

రాష్ట్రంలోని ప్రభుత్వ గురుకులాలు, బీసీ, ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూళ్లు, మోడల్ స్కూళ్లు, కస్తూరిబా పాఠశాలలకు చెందిన విద్యార్థులను కూడా ఒకరోజు మిస్ వరల్డ్ వేడుకలు చూపించాలని ముఖ్యమంత్రి సూచించారు. వేడుకలు జరిగే రోజుల్లో హైదరాబాద్ అంతటా మిస్ వరల్డ్ సందడి కనిపించేలా తోరణాలు, లైటింగ్, రైడింగ్ లతో పాటు సిటీలోని ముఖ్యమైన జంక్షన్లు, చారిత్రక ప్రదేశాలను అందంగా అలంకరించాలని అన్నారు.

## కాలినడక భక్తుల కోసం కరెంటు బస్సులు

తిరుమల, మే 5: శ్రీవారి దర్శనార్థం తిరుపతి నుంచి కాలినడకన తిరుమల వచ్చే సామాన్య భక్తుల కోసం 20 ఎలక్ట్రిక్ బస్సులను టీటీడీ ఉచితంగా నడపనుంది. ఈ వాహనాల్లో తిరుపతి బస్టాండ్, రైల్వేస్టేషన్ నుంచి అలిపిరి మీదుగా శ్రీవారి మెట్టు వరకు యాత్రికులను తీసుకెళ్లాలని ఛైర్మన్ బీఆర్ నాయుడు నిర్ణయించారు. ఇప్పటికే టీటీడీ ఆధ్వర్యంలో ఉచిత ధర్మరథం బస్సులను ఏర్పాటు చేసినా భక్తుల రద్దీకి అనుగుణంగా లేవు. ఇదే అదనుగా జీపు, ట్యాక్సీ, ఆటోడ్రైవర్లు భక్తులను అడ్డంగా దోచుకుంటున్నారు. ఈ నేపథ్యంలో త్వరలో నిర్వహించే టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశంలో దాతల సహకారంతో బస్సులను కొనుగోలు చేయాలని ప్రయత్నాలు చేస్తున్నారు.


## నీట్ రాసిన తల్లీబిడ్డలు

ఖమ్మం, మే 5: చదువుకు వయస్సుతోనూ, వరుసలతోనూ నిమిత్తం లేదనేది గతంలో చాలాసార్లు రుజువైంది. నిన్న నీట్ పరీక్షల సందర్భంగా మరోసారి దీన్ని రుజువు చేసే ఘటనలు జరిగాయి. దానిలో ఒకటి.. విద్యార్థినితో పాటు ఆమె తల్లి కూడా నీట్ పరీక్ష రాయడం విశేషం. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం మంచ్యానాయక్ తండాకు చెందిన భూక్యా సరిత(38) ప్రస్తుతం ఆర్ఎంపీగా పనిచేస్తున్నారు. 2007లో బీఎస్సీ నర్సింగ్ చదివే సమయంలో పెండ్లయినందున పరీక్ష రాయలేకపోయారు. ఆ తర్వాత సంసారంలో పడి దాన్ని పూర్తి చేయలేకపోయారు. ఈమె భర్త భూక్యా కిషన్ ఆర్ఎంపీగా చేస్తున్నారు. వీరిద్దరూ తమ కుమార్తెను ఎంబీబీఎస్ చదివించి డాక్టర్‌ను చేయాలనుకున్నారు. ఖమ్మంలో కుమార్తె నీట్ శిక్షణ పొందుతున్న సమయంలో తల్లికి కూడా పరీక్ష రాయాలనే కోరిక కలిగింది. దీంతో ఆమె కూడా నీట్‌కు ప్రిపేరయ్యారు. నిన్న జరిగిన నీట్ పరీక్షలో తల్లి సరిత సూర్యాపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో పరీక్ష రాయగా.. కుమార్తె కావేరి ఖమ్మంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎన్ఎస్పీ క్యాంపు కేంద్రంలో పరీక్ష రాశారు.

# ట్రంప్.. ఇక టారిఫ్ సినిమా సూపిత్తడట

(మొదటి పేజీ తరువాయి)

ఉంటుందంటున్నారు విశ్లేషకులు. కొద్ది రోజుల్లో విడుదల కాబోయే విదేశీ చిత్రాలను ఇప్పటికే కొనుగోలు చేసిన డిస్ట్రిబ్యూటర్లలో తీవ్ర గందరగోళం నెలకొంది. ముందస్తు డీల్ తో ఇప్పటికే చిత్రాలను కొనుగోలు చేసినవారు.. ఇప్పుడు సుంకాలు కట్టాల్సి వస్తే మాత్రం ఆర్థికంగా తీవ్ర భారాలు మోయాల్సి రావచ్చనేది ఇండస్ట్రీ టాక్. ఇదే జరిగితే పలు డిస్ట్రిబ్యూటర్లు తీవ్ర నష్టాల్లో కూరుకుపోయే ప్రమాదముంది. వారు కొన్ని సినిమా నడిచి అదనంగా కట్టిన సుంకాల మేరకు లాభాలొస్తే ఫరవాలేదు. కానీ, రాకపోతే మాత్రం అంతే సంగతులని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడబు మన సినిమాలపై 100 శాతం టారిఫ్ లు విధిస్తే భారతీయ సినిమా పరిశ్రమ ఆర్థికంగా కుదేలవుతుందని బాలీవుడ్ దర్శకుడు వివేక్ అగ్నిహోత్రి ఒక పోస్ట్‌లో తెలిపారు. గత కొన్నేళ్లుగా భారతీయ సినీ పరిశ్రమకు అమెరికాలో మంచి ఆదరణ దక్కుతోంది. పఠాన్, ఆర్ఆర్ఆర్, డుంకీ, జవాన్ వంటి భారతీయ సినిమాలు అగ్రరాజ్యంలో కలెక్షన్ల రికార్డులు బద్దలు కొట్టాయి. విదేశీయుల ఆదరణతో భారత సినీ రంగానికి అంతర్జాతీయ యవనికపై ప్రత్యేక స్థానం లభించింది. ముఖ్యంగా ఉత్తర అమెరికాలో మన సినిమాలకు ఉండే క్రేజ్ అంతా ఇంతా కాదు. ఇక, చాలా సినిమాలను భారత్ లో కంటే ఒక రోజు ముందుగానే అమెరికాలో రిలీజ్ చేస్తారు. సినిమాపై అంచనాలు పెరగడంతో పాటు బాక్సాఫీసు కలెక్షన్లు పెంచేందుకు కూడా ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది.




**ఓటీటీలకూ తప్పని నష్టాలు..**

ట్రంప్ తాజా ప్రకటనతో చాలా సినిమాల డీల్స్ స్తంభించాయి. కొత్త ప్రాజెక్టులు కొనుగోలు చేసే విషయంలో డిస్ట్రిబ్యూటర్లు పునరాలోచనలో పడ్డారు. ఇక, ఓటీటీలకూ ఈ సుంకాలను విస్తరిస్తే గనుక నెట్ ఫ్లిక్స్ ప్రైమ్ వీడియో వంటి ప్లాట్ ఫామ్‌లు భారతీయ కంటెంట్ కోసం తమ పెట్టుబడులను తగ్గించుకునే అవకాశం ఉంది. దీంతో భారత నిర్మాతలకు డిజిటల్ పంపిణీ కూడా లాభదాయకంగా ఉండకపోవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఓవర్సీస్ కలెక్షన్లపై ఎక్కువగా ఆధారపడే చిన్న నిర్మాణ సంస్థలకు ఇబ్బందులు తప్పవు. ఇక, అమెరికా మార్కెట్ నుంచి ఆదాయం తగ్గితే.. సినిమాల బడ్జెట్ ను కూడా కుదించుకునే అవకాశాలున్నాయనేది నిపుణుల మాట. ఇలా ఎవరి ఆందోళనలు ఎలా ఉన్నా కూడా.. ట్రంప్ ప్రకటనపై సమగ్ర విధానం ప్రకటిస్తే గానీ ఏ విషయమైనా స్పష్టంగా అర్థం కాదు. అప్పటి వరకూ అంచనాలు.. ఊహాగానాలే..!

# పాక్ కు నీళ్లు, నిధులు బంద్!

(మొదటి పేజీ తరువాయి)

భాగంగా సింధూ జలాల ఒప్పందాన్ని రద్దు చేసుకుని నీటి సరఫరాకు చెక్ పెట్టిన భారత్.. ఇప్పటికే బాగలిహార్ డ్యామ్ నీటిని నిలిపేయగా.. తాజాగా సలాల్ డ్యామ్ ను కూడా మూసేసి దాని నీటికి కూడా చెక్ పెట్టింది. ఈ రెండు హైడ్రో పవర్ ప్రాజెక్టుల రిజర్వాయర్ల నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు అవసరమైన పూడికతీత పనులు చేపట్టింది. మరోవైపు జమ్మూకశ్మీర్లో నిలిచిపోయిన ఆరు ప్రాజెక్టుల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

**నిధులివ్వొద్దంటూ ఏడీబీకి వినతి..**

దీనికి తోడు ఆర్థిక మూలాలను దెబ్బతీయాలనే ఉద్దేశంతో ప్రపంచ ద్రవ్య సంస్థల నుంచి నిధులు ఆపే ప్రయత్నాలను మొదలు పెట్టింది భారత్. ఉగ్రవాదానికి ఊతమిస్తున్న పాక్ కు నిధులు ఇవ్వొద్దంటూ తాజాగా ఏషియన్ డెవలప్మెంట్ బ్యాంకు(ఏడీబీ)ను కోరింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఏడీబీ చీఫ్ మసాటో కాందతో ఇటీవల భేటీ అయినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇప్పటికే ఫైనాన్షియల్ టాస్క్ ఫోర్స్ గ్రేలిస్టులోకి పాకిస్థాన్ ను పెట్టించేందుకు ప్రయత్నిస్తోన్న సంగతి తెలిసిందే. ఇక, అంతర్జాతీయ ద్రవ్య నిధి నుంచి ఆ దేశానికి అందే 7 బిలియన్ డాలర్ల సాయంపైనా భారత్ తగు చర్యలు చేపట్టాలని నిర్ణయించింది. ఈ విజ్ఞప్తిని ఏడీబీ అంగీకరించి నిధులు ఆపేస్తే ఇప్పటికే ఆర్థికంగా చతికిలపడిన పాక్‌పై మరో పిడుగు పడినట్టే. మరో పక్క ప్రపంచ బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పరమేశ్వరన్ అయ్యర్ కు అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్)లో తాత్కాలిక విధులు నిర్వర్తించనున్నారు. ఐఎంఎఫ్ బోర్డులో భారత్ తరఫున నామినీ డైరెకర్‌గా తాత్కాలిక బాధ్యతలు అప్పగించినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. మే 9న జరగనున్న సమావేశం నేపథ్యంలో ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. మూడేళ్ల కాలానికి 7 బిలియన్ డాలర్ల ప్యాకేజీ కోసం గత ఏడాది జులైలో ఐఎంఎఫ్-పాక్ల మధ్య ఒప్పందం ఖరారైంది. ఆ రోజున వివిధ అంశాలతో పాటు పాక్ బెయిలౌట్ ప్యాకేజీపై సమీక్ష జరగనుంది. దానిలో పాక్‌పై భారత్ ప్రతిపాదించే ఆర్థిక షరతులకు ఆమోదం లభిస్తుందన్న ఆశాభావాన్ని భారత ప్రభుత్వ పెద్దలు వ్యక్తం చేస్తున్నారు.

# కుదేలవుతున్న పాక్ ఆర్థిక వ్యవస్థ

(మొదటి పేజీ తరువాయి)

ఆ దేశ విదేశీ మారక ద్రవ్య నిల్వలు కరిగిపోతాయని మూడీస్ హెచ్చరించింది. ఇప్పుడు విదేశీ అప్పుల చెల్లింపులకు అవి సరిపోని పరిస్థితి నెలకొన్నట్లు వెల్లడించింది. ఈ పరిస్థితుల్లో కూడా ఆ దేశం ఐఎంఎఫ్ నిబంధనలు పాటించాల్సి ఉంటుందన్నారు.

మరోవైపు భారత ఆర్థిక వ్యవస్థ బలంగానే ఉండటంతోపాటు.. స్థిరమైన వృద్ధిరేటును నమోదు చేస్తుందని వెల్లడించింది. దీనికి తోడు నాణ్యమైన ప్రభుత్వ వ్యయాలు, ప్రజల వినిమయ శక్తి చెప్పుకోదగ్గ స్థాయిలోనే ఉంటుందన్నారు. ప్రస్తుత ప్రాంతీయ ఉద్రిక్తతల ప్రభావం అతి స్వల్పంగానే ఉంటుందన్నారు. ''భారత ఆర్థిక కార్యకలాపాల్లో పెద్దగా ఇబ్బందులు ఏమీ ఉంటాయని అనుకోము. ఎందుకంటే దానికి పాకిస్థాన్‌తో ఉన్న ఆర్థిక సంబంధాలు అతి తక్కువ. దాని మొత్తం ఎగుమతుల్లో ఇస్లామాబాద్‌కు వెళ్లేవి 0.5 శాతం మాత్రమే. ఇక మా జియోపొలిటికల్ అంచనా ప్రకారం భారత్-పాక్ మధ్య పరిమిత స్థాయిలోనే సైనిక ప్రతిస్పందనలు ఉండొచ్చు. ఇక సమయాన్ని బట్టి అప్పుడప్పుడు ఇవి ఎగసిపడొచ్చు. ఇరుదేశాలకు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నుంచి ఇలానే జరుగుతోంది. అంతేకానీ, విస్తృత స్థాయి సైనిక ఘర్షణకు ఇవి దారితీయవు'' అని పేర్కొంది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఇరు దేశాల సంబంధాలు అతి స్వల్పస్థాయికి పడిపోయాయి. పరస్పరం పోర్టుల్లోకి నౌకలను నిషేధించాయి. ఎగుమతులు, దిగుమతులను నిలిపేశాయి.

## జాగ్తే రహో

(మొదటి పేజీ తరువాయి)

కల్పించాలి తెలిపింది.పాకిస్తాన్‌పై భారత్ ప్రతీకార దాడులు చేయొచ్చనే వార్తలు వెలువడుతున్న తరుణంలో కేంద్ర హోంశాఖ ఈ తరహా ఆదేశాలివ్వడం గమనార్హం. పాక్ సైతం ప్రతిదాడికి దిగితే అందుకు ముందుగానే రాష్ట్రాలను సిద్ధం చేస్తున్నట్లు కనబడుతోంది. శత్రు దేశం దాడి చేస్తే ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై సన్నద్ధతా కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొంది. ఎయిర్ రైడ్ హెచ్చరిక సైరెన్ల పనితీరును పరీక్షించాలని ఆదేశించింది. అత్యవసర సమయాల్లో ఎలా స్పందించాలో పౌరులకు తెలపాలని నిర్దేశించింది.పాకిస్థాన్ కవ్వింపు, రెచ్చగొట్టే చర్యలకు పాల్పడే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యల్లో భాగంగా సరిహద్దు రాష్ట్రాలైన పంజాబ్, గుజరాత్, రాజస్థాన్తో పాటు జమ్మూకశ్మీర్, హిమాచల్ప్రదేశ్ రాష్ట్రాలకు ఈ సూచనలు చేసినట్లు సమాచారం. ఆయా రాష్ట్రాలు అప్రమత్తంగా ఉండాలని ఇప్పటికే పలు సూచనలు చేసిన కేంద్రం.. తాజాగా నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రజల స్వీయ రక్షణలో భాగంగా మాక్ డ్రిల్స్ ద్వారా అవగాహన కల్పించడంపై దృష్టిసారించినట్లు తెలుస్తోంది. వైమానిక దాడులు జరిగితే.. ఎలా వ్యవహరించాలి? ప్రజలు ఆందోళనకు గురికాకుండా వారికి ఎలాంటి సూచనలు చేయాలి.

# తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి ఉన్నం

- **ప్రధాన నగరాలన్నిటితో హైదరాబాద్‌కు రోడ్ కనెక్టివిటీ**
- **రోడ్డు నిర్మాణాల కోసం పెండింగ్ భూసేకరణలు పూర్తి చేయాలి**
- **స్మార్ట్ నగరాలే కాదు.. స్మార్ట్ గ్రామాలు నేటి అవసరం**
- **అంబర్ పేట ఫ్లై ఓవర్ ప్రారంభోత్సవ సభలో నితిన్ గడ్కరీ**



హైదరాబాద్, మే 5: హైదరాబాద్‌లోని అంబర్ పేట, బీహెచ్ఈఎల్ కూడలిలో నిర్మించిన వంతెనలను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రారంభించారు. రోడ్ల నిర్మాణం కోసం పెండింగ్ లో ఉన్న భూసేకరణపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలన్నారు. అంబర్ పేట ఫ్లై ఓవర్ ప్రారంభోత్సవం చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ ఫ్లైఓవర్ పనులు సరిగా జరగడం లేదన్నారు. అందుకే పనులు వేగంగా చేసేలా కొత్త కాంట్రాక్టర్ను మార్చామని, పది నెలల్లో ఉప్పల్ ఫ్లైఓవర్ పూర్తి చేస్తామని చెప్పారు. అంబర్ పేట ఫ్లై ఓవర్ ను రూ.145 కోట్లతో, నాలుగు వరుసల్లో సుమారు 1.5 కి.మీ మేర నిర్మించగా.. చందానగర్ నుంచి బీహెచ్ఈఎల్ మీదుగా రామచంద్రాపురం వరకు రూ.176 కోట్లతో 1.6కి.మీ మేర బీహెచ్ఈఎల్ వంతెనను నిర్మించారు. ''హైదరాబాద్లో ఐటీతోపాటు ఫార్మా రంగం కూడా పెద్దదే. అన్ని ప్రధాన నగరాలను హైదరాబాద్ కు కనెక్ట్ చేసేలా జాతీయ రహదారులు అభివృద్ధి చేశాం. తెలంగాణ అభివృద్ధికి మోదీ నేతృత్వంలో మేమంతా కట్టుబడి ఉన్నాం. ఇండోర్- హైదరాబాద్ కారిడార్ తెలంగాణ పనులు పూర్తి చేశాం. మహారాష్ట్రలో కూడా పనులు త్వరితగతిన పూర్తి చేస్తాం. ఈ కారిడార్ పూర్తయితే 20 గంటల ప్రయాణం 10 గంటల్లోనే చేయొచ్చు. హైదరాబాద్ రీజనల్ రింగ్ రోడ్డు పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. హైదరాబాద్ - విజయవాడ 4 లైన్ల రోడ్డును 6 లైన్లుగా మారుస్తాం. డీజిల్, పెట్రోల్ వాహనాలను తగ్గించి.. సీఎన్జీ, ఎలక్ట్రికల్ వాహనాలను ప్రోత్సహించాలి. రైతన్నలు వ్యవసాయంలో కూడా పర్యావరణహిత వాహనాలను వాడాలని విజ్ఞప్తి చేస్తున్నాను. ఒక్క స్మార్ట్ నగరాలతో దేశం అభివృద్ధి చెందదు.. స్మార్ట్ గ్రామాలు కావాలి'' అని గడ్కరీ పేర్కొన్నారు.

**రాష్ట్ర మంత్రులు భూసేకరణ పూర్తి చేయాలి : కిషన్ రెడ్డి**

నితిన్ గడ్కరీ కృషి వల్ల ఏ గ్రామానికి వెళ్లినా జాతీయ రహదారులు కనిపిస్తున్నాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఫలితంగా రోడ్డు ప్రమాదాలు, మరణాలు తగ్గాయన్నారు. 'అమెరికాను తలదన్నేలా భారత్లో జాతీయ రహదారులు ఉన్నాయి. నితిన్ గడ్కరీ దగ్గరకు ఏ పార్టీ ఎంపీ వెళ్లి అడిగినా కాదనకుండా ఇస్తారు. ఆయనన్ను ఫ్లై ఓవర్ల మంత్రి అని కూడా పిలుస్తుంటారు. అంబర్ పేట ఫ్లైఓవర్ ప్రారంభించుకున్నప్పటికీ సర్వీస్ రోడ్డు అసంపూర్తిగానే ఉంది. ఆరు ప్రాంతాల్లో భూసేకరణ పూర్తి కాకపోవడంతో సర్వీస్ రోడ్డు పూర్తి కాలేదు. రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ ఆయా ప్రాంతాల్లో భూసేకరణ పూర్తి చేయాలి'అని అన్నారు.

**ప్రారంభోత్సవంలో ఉద్రిక్తత..**

అంబర్పేట పైవంతెన ప్రారంభోత్సవ సమయంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. కాంగ్రెస్, భాజపా శ్రేణుల మధ్య తోపులాట చోటు చేసుకుంది. భాజపా నాయకులు మోదీ..మోదీ అంటూ నినాదాలు చేశారు. కాంగ్రెస్ నాయకులు పోటీగా నినాదాలు అందుకున్నారు. గడ్కరీ కాన్వాయిని కాంగ్రెస్ నేతలు అడ్డుకున్నారు.

# బాలీవుడ్‌లోని చాలామంది అమ్ముడు పోయారు

- **ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడక పోవడానికి కారణమిదే**
- **విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యలు**

హైదరాబాద్, మే 5: బాలీవుడ్‌లోని చాలామంది ప్రభుత్వానికి అమ్ముడుపోయారంటూ విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. అందుకే, ఏ విషయంలోనైనా వారు ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడటం లేదన్నారు.

'ఒక విషయంపై మాట్లాడాలా? లేదా అనేది నటీనటులపైనే ఆధారపడి ఉంటుంది. సినిమాల నిర్మాణ విషయంలో వారికంటూ ఒక అవగాహన ఉండాలి. ఆ సినిమాను విడుదల చేయడానికి కూడా పోరాటం చేయాల్సి ఉంటుంది. నిజం చెప్పాలంటే ప్రభుత్వానికి వ్యతిరేకంగా వారు ఎందుకు మాట్లాడరంటే.. ఇండస్ట్రీలోని సగం మంది నటీనటులు అమ్ముడుపోయారు. మరికొంతమందికి మాట్లాడే ధైర్యం లేదు. నా మిత్రుడు ఒకరు ఇదే విషయాన్ని చెప్పాడు. అతడి పరిస్థితి నేను అర్థం చేసుకోగలను. కానీ ఒక్క విషయాన్ని చెప్పగలను. నేరాలు చేసిన వారినైనా వదిలేస్తుందేమో కానీ, మౌనంగా చూస్తూ ఉన్న వారిని మాత్రం కాలం.. చరిత్ర విడిచిపెట్టదు.'అని ప్రకాశ్ రాజ్ తెలిపారు.

బాలీవుడ్లో తనకు అవకాశాలు తగ్గడంపై మాట్లాడుతూ.. 'నేను ఏదైనా సూటిగా మాట్లాడతాను. రాజకీయ విషయాలపై నా అభిప్రాయాన్ని ఎప్పటికప్పుడు బయటపెడుతుంటా. ఒకవేళ నాతో వర్క్ చేస్తే.. భవిష్యత్తులో తమకు సమస్యలు వస్తాయని వారు భావించి ఉండొచ్చు. అందుకే నాకు అవకాశాలు తగ్గాయి. ఇలాంటి పరిస్థితులు చూసిన తర్వాతే.. విషయం ఏదైనా గళం విప్పాలనే భావన నాకు కలిగింది' అని ఆయన చెప్పారు.




# మా అభివృద్ధి.. మీ అక్రమార్జనపై బహిరంగ చర్చకు సిద్ధమా

- కట్టమంచి చెరువులో నిబంధనల ప్రకారమే పూడికమట్టి తొలగిస్తున్నారు
- పది నెలల్లో నియోజకవర్గం అభివృద్ధి కోసం 56.30 కోట్లు వెచ్చించాం
- చిత్తూరు అభివృద్ధిని అడ్డుకుంటే ప్రజల క్షమించరు
- చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్



**చిత్తూరు,మే 05,మనం న్యూస్:** కూటమి ప్రభుత్వంలో జరిగిన, జరుగుతున్న అభివృద్ధి.. మీ ఐదేళ్ల వైకాపా పాలనలో జరిగిన విధ్వంసం, అక్రమాలు, దౌర్జన్యాలు, అక్రమార్జనలపై బహిరంగ చర్చకు సిద్ధమని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ సవాల్ చేశారు. కట్టమంచి చెరువులో మట్టి అక్రమంగా తరలిస్తున్నారని, దౌర్జన్యాల పాల్పడుతున్నారని వైకాపా నాయకులు, కొన్ని పత్రికల్లో వచ్చిన వార్తలపై ఎమ్మెల్యే స్పందించారు. మేయర్ అముద, చుడా చైర్ పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, సీనియర్ నాయకులు చంద్రప్రకాష్, సురేంద్ర కుమార్, వసంత కుమార్, కాజూరు బాలాజీ, అశోక్ తదితరులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చిత్తూరు నగరపాలక పరిధిలో భూగర్భ జలాలు పెంచడం, కట్టమంచి చెరువు కట్టను పటిష్టం చేసి సుందరీ కరణ చేయాలనే మంచి ఉద్దేశంతో పూడికతీత పనులు చేస్తుంటే.. అక్కడేదో అక్రమంగా మట్టి తవ్వుతున్నట్లు కొందరు పని కట్టుకొని ప్రచారం చేయడం తగదన్నారు. ఎన్టీఆర్ జలాశయంలో నీటిని కట్టమంచి చెరువుకు తెప్పించాలనే భావనతో.. అధికారుల సూచన మేరకు ఆరు నెలల క్రితం స్వయంగా జిల్లా కలెక్టర్ గారే స్వయంగా పూడికతీత పనులు ప్రారంభించడం జరిగిందని, వర్షాలు రావడం, చెరువులో నీటి మట్టం కారణంగా పనులు ఆలస్యమైందన్నారు. కట్టమంచి చెరువులో పూడిక పేరుకు పోయి.. కాలువల కంటే ఎత్తుగా ఉండడంతో.. నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయిందని ఈ పరిస్థితుల్లో చెరువులు వీలైనంత ఎక్కువ నీటిని నిల్వ చేయడం కోసం ఇరిగేషన్ అధికారుల పర్యవేక్షణలోనే పూడికతీత పనులు జరుగుతున్నాయని చెప్పారు. చెరువులో నీటి సామర్థ్యం పెరగడం వల్ల పరిసర ప్రాంతాల్లోని సుమారు 480 పైగా మున్సిపల్ బోర్లు రీఛార్జ్ అవుతాయని.. ప్రజలకు నీటి సమస్య తీరుతుందనే గొప్ప ఉద్దేశంతో పనులు చేస్తుంటే వాస్తవాలు తెలుసుకోక తప్పుడు సమాచారం ప్రచారం చేయడం దారుణమన్నారు. కట్టమంచి చెరువులో పూడికతీత పనులపై ఇరిగేషన్ శాఖ ఈఈ మురళి కుమార్ ద్వారా మీడియా ప్రతినిధుల సందేహాలను నివృత్తి చేశారు. చేస్తున్న మంచిపని గురించి ప్రజలకు తెలియాలనే ఉద్దేశంతోనే ఆధారాలతో సహా వివరించినట్లు చెప్పారు. చిత్తూరులో కొంతమంది తమకుతాముగా నీతివంతమైన నాయకులుగా చలామణి అయ్యేందుకు.. మంచి పనులు చేస్తున్న కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారన్నారు. చిత్తూరు అభివృద్ధి చేయాలని మంచి ఉద్దేశంతో రాజకీయాల్లోకి వచ్చానని.. కానీ అక్రమార్జనలో ఆరితేరిపోయిన వైకాపా ప్రతిపక్ష నాయకులు కుటిల రాజకీయాలు చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డుపెట్టుకొని.. చేసిన అక్రమాలన్నింటినీ వెలికి తీస్తామని, ప్రకృతి వనరులను దోచుకున్న తీరును ప్రజల ముందుకు తెస్తామన్నారు. విలేకరుల సమావేశంలో భాగంగా చిత్తూరు బస్టాండును పురపాలక శాఖ ఆధ్వర్యంలో బస్టాండ్, షాపింగ్ మాల్ గా అభివృద్ధి చేస్తామన్నారు. పీవీకేఎన్ కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించామని.. యూనివర్సిటీకి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇటీవల రాజస్థాన్ లోని యూనివర్సిటీకి వెళ్లి పరిశీలించామని, మరో నాలుగైదు యూనివర్సిటీలను పరిశీలించి.. చిత్తూరుకు రావలసిందిగా ఆహ్వానిస్తామన్నారు. నగరంలో ప్రభుత్వ స్థలాలను కబ్జాలకు గురికాకుండా.. ఆయా సంస్థలకు ఆదాయ మార్గాలుగా మారుస్తామన్నారు. నగరంలో రోడ్ల విస్తరణ పనులు జరుగు తున్నాయని.. మొదటగా ప్రభుత్వ స్థలాల్లో పనులు చేస్తున్నామని.. తర్వాత ప్రజలను ఒప్పించి, టీడీఆర్ బాండ్ల ద్వారా రోడ్ల విస్తరణ చేయడానికి వీలుగా విషయాన్ని సీఎం గారి, మున్సిపల్ శాఖ మంత్రి గారి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. త్వరలోనే పనులు వేగవంతం అవుతాయన్నారు. చిత్తూరు నియోజకవర్గంలో గడిచిన 10 నెలలోనే రూ.56.30 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని, పనులు పూర్తి చేసే ప్రారంభోత్సవాలు చేసిన విషయం ప్రజలకు తెలుసన్నారు. గత ఐదేళ్ల వైకాపాలనలో ఎంత అభివృద్ధి చేశారో? ఎన్ని ప్రారంభోత్సవాలు చేశారో ప్రజలకు తెలపాలన్నారు. సమావేశంలో తెదేపా క్లస్టర్ ఇన్చార్జులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలకు పరిష్కార వేదికగా ప్రజా ఫిర్యాదుల పరిష్కారం కార్యక్రమం



ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం చేయకండి
సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కారం కార్యక్రమంలో 38 ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ ఎన్.మణికంఠ చందోలు

**చిత్తూరు,మే 05,మనం న్యూస్:** ప్రజా ఫిర్యాదుల పరిష్కారం కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, నిర్దేశించిన గడువులోగా ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ ఎన్. మణికంఠ చందోలు, ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు, నేరుగా ఎస్పీ అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ మరియు ఇంచార్జ్ అడ్మిన్ ఆర్.రాజశేఖర రాజు మరియు డి.టి.సి. డి.ఎస్పీ జె.రాంబాబు కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ప్రతి ఫిర్యాదును సమగ్రంగా పరిశీలించి, త్వరితగతిన విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేయడమే మా లక్ష్యం అని ఎస్పీ అన్నారు. ఈ ఫిర్యాదులపై తక్షణ చర్య తీసుకొని ప్రజలు న్యాయం పొందేలా చూడాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు.

# ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభమైన కీలపట్ల శ్రీ కోనేటిరాయ స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు



**తిరుపతి/ కీలపట్ల,మే 05,మనం న్యూస్:** చిత్తూరు జిల్లా గంగవరం మండలంలోని కీలపట్ల శ్రీ కోనేటిరాయ స్వామివారి బ్రహ్మోత్సవాలు సోమవారం ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా మధ్యాహ్నం 12.05 నుండి 12.20 గంటల మధ్య కర్కాటక లగ్నంలో ధ్వజారోహణం నిర్వహించారు. ఇందులో భాగంగా సకల దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ ధ్వజారోహణం ఘట్టాన్ని నిర్వహించారు. 18 గణాలను, ముక్కోటి దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించడం దీని లక్ష్యం. ఇందులో గరుత్మంతుని చిత్రంతో కూడిన ధ్వజపటానికి అర్చకులు ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం అర్చకుల వేదమంత్రోచ్చరణల మధ్య శాస్త్రోక్తంగా గరుత్మంతుణ్ణి కొత్త వస్త్రంపై లిఖించి, పూజలు చేసి, ధ్వజస్తంభంపై ప్రతిష్టించారు. అంతకుముందు గ్రామ పొలిమేరలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. రాత్రి 7 గంటలకు పెద్దశేష వాహనంపై శ్రీ కోనేటిరాయ స్వామివారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో శ్రీమతి పి.వరలక్ష్మీ, సూపరింటెండెంట్ శ్రీ రాజ్ కుమార్, టెంపుల్ ఇన్స్పెక్టర్ శ్రీ ఎన్. గజేంద్ర ఆలయ అర్చకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు. ప్రతిరోజూ రోజు ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు వాహనసేవలు జరుగుతాయి.

వాహనసేవల వివరాలు ఇలా ఉన్నాయి. ఉత్సవాల్లో భాగంగా మే 9వ తేదీ సాయంత్రం 4 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం జరుగనుంది. రూ.500/- చెల్లించి ఇద్దరు కల్యాణోత్సవంలో పాల్గొనవచ్చు. ఉత్తరీయం, రవికె, అన్నప్రసాదం బహుమానంగా అందజేస్తారు. మే 14వ తేదీ సాయంత్రం 4 గంటలకు పుష్పయాగం వైభవంగా నిర్వహించనున్నారు.ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, దాససాహిత్య ప్రాజెక్టు, అన్నమాచార్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ప్రతిరోజు ఆధ్యాత్మిక, భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

| తేదీ | |
|---|---|
| 05-05-2025 | సాయంత్రం - పెద్ద శేష వాహనం |
| 06-05-2025 | ఉదయం - చిన్న శేషవాహనం<br>సాయంత్రం - హంస వాహనం |
| 07-05-2025 | ఉదయం - సింహ వాహనం<br>సాయంత్రం - ముత్యపుపందిరి వాహనం |
| 08-05-2025 | ఉదయం - కల్పవృక్ష వాహనం<br>సాయంత్రం - సర్వభూపాల వాహనం |
| 09-05-2025 | ఉదయం - మోహినీ ఉత్సవం<br>సాయంత్రం - శ్రీవారి కల్యాణోత్సవం, గరుడ వాహనం |
| 10-05-2025 | ఉదయం - హనుమంత వాహనం<br>సాయంత్రం - వసంతోత్సవం, గజ వాహనం |
| 11-05-2025 | ఉదయం - సూర్యప్రభ వాహనం<br>సాయంత్రం - చంద్రప్రభ వాహనం |
| 12-05-2025 | ఉదయం - రథోత్సవం<br>సాయంత్రం - అశ్వవాహనం |
| 13-05-2025 | ఉదయం - చక్రస్నానం<br>సాయంత్రం - ధ్వజావరోహణం |

### శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామివారి
## బ్రహ్మోత్సవాల పోస్టర్లు ఆవిష్కరణ



**తిరుపతి,మే 05,మనం న్యూస్:** నారాయణవనం శ్రీ పద్మావతి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల పోస్టర్లు, కరపత్రాలను టీటీడీ జెఈవో వి.వీరబ్రహ్మం ఆవిష్కరించారు. టీటీడీ పరిపాలనా భవనంలో గల జేఈవో కార్యాలయంలో సోమవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ మే 11 నుండి 19వ తేదీ వరకు శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరగనున్నాయని తెలిపారు. మే 6న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, మే 10న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ నిర్వహిస్తారని చెప్పారు.

**ఆలయ నేపథ్యం:**

శ్రీ ఆకాశ మహారాజు నారాయణవనమును కేంద్రంగా చేసుకుని పాలించు చుండెను. వారు సంతానార్థియై పుత్రకామేష్టి యాగము చేయ సంకల్పించి, యాగ స్థలమును స్వర్ణ హలముతో దున్నుతున్న తరుణమున ఒక మందసము నందు పద్మముపై పడుకొన్న చందమున ఒక ఆడ శిశువు లభించింది. ఆ శిశువు పద్మోద్భవిగా తలచి పద్మావతి అను నామ ధేయము చేసి రాజు గారు ఆమెకు విద్యాబుద్ధులు నేర్పి, దిన దిన ప్రవర్ధమానురాలుగా చేయసాగెను. శ్రీ పద్మావతి దేవి యుక్త వయస్సు సమయములో ఒకనాడు తన చెలికత్తెలతో వన విహారము చేయు సందర్భమున వైకుంఠపతియైన శ్రీ శ్రీనివాసుడు వేట మార్గమున వచ్చుచుండగా ఆమెను చూచి, మోహించి, ఆమెని ఆకాశరాజు అనుమతితో సకల దేవతల సమక్షమున విళంబి నామ సంవత్సరం, వైశాఖ మాసం, శుక్లదశమి, శుక్రవారం వివాహం చేసుకొనెను. వారి జ్ఞాపకార్థం శ్రీ ఆకాశ మహారాజు నారాయణవనమున ఆలయ నిర్మాణం గావించి, వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం పూజా కైంకర్యాలు జరుపుటకు ఏర్పాటు చేసినారు. శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారు అర్చావతారియై, వృక్ష స్థలమున లక్ష్మీదేవి, దశావతార వడ్డాణం, వేట ఖడ్గం, దక్షిణ హస్తమున కల్యాణ కంకణధారియై, నేత్ర దర్శనముతో వేంచేసి యున్నారు. ఈ ఆలయ ఆకాశరాజు పరిపాలన అనంతరం, కార్వేటినగరం సంస్థానాధీశుల ద్వారా నిర్వహించబడి, తదనంతరం 09-04-1967 సంవత్సరం నుండి టిటిడిలోకి చేర్చబడి నిత్యోత్సవ, వారోత్సవ, పక్షోత్సవ, సంవత్సరోత్సవాలతో విలసిల్లుతున్నది.

**బ్రహ్మోత్సవాల్లో వాహన సేవల వివరాలు :**

తేదీ ఉదయం సాయంత్రం
11-05-2025 ధ్వజారోహణం, పెద్దశేష వాహనం.
12-05-2025 చిన్నశేష వాహనం, హంస వాహనం.
13-05-2025 సింహ వాహనం, ముత్యపుపందిరి వాహనం.
14-05-2025 కల్పవృక్ష వాహనం, సర్వభూపాల వాహనం.
15-05-2025 మోహినీ అవతారం, గరుడ వాహనం.
16-05-2025 హనుమంత వాహనం, గజ వాహనం.
17-05-2025 సూర్యప్రభ వాహనం, చంద్రప్రభ వాహనం.
18-05-2025 రథోత్సవం కల్యాణోత్సవం, అశ్వవాహనం.
19-05-2025 చక్రస్నానం, ధ్వజావరోహణం.

బ్రహ్మోత్సవాల్లో ప్రతిరోజూ ఉదయం 7.30 నుండి 9.30 గంటల వరకు, రాత్రి 7 నుండి 9 గంటల వరకు వాహనసేవలు జరుగనున్నాయి. మే 18వ తేదీ రాత్రి 8.30 నుండి 10 గంటల వరకు స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తారు. రూ.1000/- చెల్లించి గృహస్తులు ఈ కల్యాణోత్సవంలో పాల్గొనవచ్చు. గృహస్తులకు ఒక ఉత్తరీయం, ఒక రవికె, ఒక లడ్డు, ఒక వడ, కుంకుమ బహుమానంగా అందజేస్తారు. ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు, దాససాహిత్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఆధ్యాత్మిక, భక్తి సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆలయాల డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో రవి ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సాంప్రదాయ ఆలయ నిర్మాణ శిల్పకళను భవిష్యత్ తరాలకు అందిస్తున్న టిటిడి



**తిరుపతి,మే 05,మనం న్యూస్:** సాంప్రదాయ ఆలయ నిర్మాణ శిల్పకళను సంరక్షించడంతో పాటు భవిష్యత్ తరాలకు అందించేందుకు టిటిడి విశేష కృషి చేస్తోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో టిటిడి ఆధ్వర్యంలో శ్రీవేంకటేశ్వర సంప్రదాయ ఆలయ నిర్మాణ శిల్పశిక్షణ సంస్థ ఏకైక సంస్థగా పేరొందింది. భారతీయ సాంప్రదాయ ఆలయ శిల్పకళ మరియు నిర్మాణ రంగంలో నైపుణ్యం గల వ్యక్తులను శిక్షణ ఇస్తున్న ఒక ప్రత్యేక సంస్థ. భారతీయ సంస్కృతి మరియు వారసత్వానికి దిశా నిర్దేశకులుగా విద్యార్థులను తీర్చిదిద్దడానికి ఈ సంస్థ సహాయపడుతుంది. ఈ సంస్థ ఆలయ నిర్మాణ శిల్పకళ, వాస్తుశిల్పం మరియు ఇతర సంబంధిత కళా రూపాలపై విద్యార్థులకు శిక్షణ ఇస్తుంది. 1960వ సంవత్సరంలో స్థాపించి శిల్పశాస్త్రాల ప్రకారం విద్యార్థులకు టిటిడి శిక్షణ ఇస్తోంది.

**కోర్సులు డిప్లొమా ఇన్ ట్రెడిషనల్ స్కల్చర్ కోర్సు**

రాష్ట్ర సాంకేతిక విద్య మరియు శిక్షణ, ఏపీ మరియు ఏఐసిటిఈ, న్యూఢిల్లీ వారి అనుమతి పొందింది. ఈ కోర్సు 4 సంవత్సరాల కాలపరిమితితో 6 విభాగాలు ఉండగా, అందులో 1. ఆలయ నిర్మాణ విభాగం 2. శిలా శిల్ప విభాగము, 3. సుధా శిల్ప విభాగము, 4. లోహ శిల్ప విభాగము, 5. కొయ్య శిల్ప విభాగము, 6. సంప్రదాయ వర్ణచిత్ర లేఖన విభాగములు ఉన్నాయి. ప్రతి సంవత్సరం ఒక్కొక్క విభాగంలో పది మంది విద్యార్థినీ విద్యార్థులకు మాత్రమే ప్రవేశము కలదు. మొత్తం ఆరు విభాగాలలో 60 మంది విద్యార్థినీ విద్యార్థులకు ప్రవేశము కల్పించబడుతుంది. డిప్లొమా కోర్సులో చేరే అభ్యర్థులు పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. విద్యార్థినీ విద్యార్థులకు ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పించబడుతుంది. నాల్గవ సంవత్సరం చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు ఆలయ నిర్మాణ శిల్పకళా విజ్ఞానం కొరకు దక్షిణ భారతదేశంలోని ప్రముఖ చారిత్రక ఆలయాల సందర్శనకు ఉచితంగా పంపబడును. శిలా శిల్పంలో ఉత్తీర్ణులైన వారికి విస్తృతంగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి.

**సంప్రదాయ కలంకారి కళ ( సర్టిఫికెట్ కోర్సు)**

వస్త్రాలపై కలంకారికళ చిత్రరచనా విధానంపై 2 సంవత్సరాల సర్టిఫికెట్ కోర్సు ఉంది. కలంకారి కళలో పదవ తరగతి పాసైన వారు ప్రతి సంవత్సరం 10 మంది విద్యార్థులకు ఈ కోర్సులో ప్రవేశం పొందవచ్చు. ప్రవేశం పొందిన విద్యార్థిని విద్యార్థులకు ఉచితంగా వసతి, భోజనం కల్పించబడును. కలంకారి కోర్సు చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు స్వయం ఉపాధిని పొందవచ్చు. దేశ విదేశాలలో కలంకారి కళకు మంచి ఆదరణ ఉంది.

**ప్రవేశం**

రాష్ట్ర ప్రభుత్వ విధానాలను అనుసరించి ప్రతి సంవత్సరం మే లేదా జూన్ నెలలో ప్రవేశపరీక్ష ద్వారా విద్యార్థినీ విద్యార్థుల ఎంపిక జరుగుతుంది. 2025 - 26 సంవత్సరానికి మే 5 నుండి జూన్ 20వ తేదీ వరకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. డిప్లొమా మరియు సర్టిఫికెట్ కోర్సులలో ప్రవేశం పొందిన విద్యార్థినీ విద్యార్థుల పేరిట, తిరుమల తిరుపతి దేవస్థానంవారు రూ. 1 లక్ష జాతీయ బ్యాంకులో డిపాజిట్ చేస్తారు. యాజమాన్యం వారి నియమావళి ప్రకారం ఈ కళలో స్థిరపడుటకు మరియు వారిని ప్రోత్సహించుటకు వడ్డీతో సహా కలిపి ఈ నగదు ఇవ్వబడును.

**ఉపాధి అవకాశాలు**

ఇక్కడ శిక్షణ పొందిన విద్యార్థులు ఇదే సంస్థలో ఉపాధ్యాయులుగా, తితిదే రినోవేషన్ విభాగంలో స్థపతులుగా, టెక్నికల్ అసిస్టెంట్లుగా, కాంట్రాక్టర్లుగా అవకాశాలు పొందుతున్నారు. అంతేగాక ప్రభుత్వ శాఖలైన దేవాదాయ, ధర్మాదాయ శాఖ, పర్యాటక శాఖ, పురావస్తు పరిశోధనా శాఖల్లో పనిచేస్తూ అనేక జాతీయ సంస్థల నుండి అవార్డులు కూడా సాధిస్తున్నారు. శిల్పశిక్షణ సంస్థకు అనుబంధంగా ఉన్న శిలా శిల్ప ఉత్పత్తి విభాగంలో కొందరు విద్యార్థులు కాంట్రాక్ట్ పద్ధతిన దేవతామూర్తుల ప్రతిమలను తయారు చేస్తున్నారు.

## తిరుమల ఘాట్ రోడ్డులో శ్రీవారికి ప్రీతిపాత్రమైన పునుగుపిల్లి మృతి



**తిరుమల,మే 05,మనం న్యూస్:** తిరుమల ఘాట్ రోడ్డులో అరుదైన జంతువు ప్రాణాలు కోల్పోయింది తిరుపతి నుండి తిరుమలకు వెళ్ళు రెండవ ఘాట్ రోడ్డులో 13వ కిలోమీటరు సమీపంలో అరుదుగా కనిపించే పునుగుపిల్లి ఘాట్ రోడ్డులో చనిపోయి కనిపించింది. పునుగు పిల్లి రోడ్డు దాటుతున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టినట్టు తెలుస్తుంది పునుగు పిల్లి నుంచి వచ్చే తైలం అంటే తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామికి ఎంతో ప్రీతిపాత్రం అని చెబుతుంటారు అందుకోసమే టీటీడీ ప్రత్యేకంగా ఈ పునుగు పిల్లల్ని సంరక్షిస్తుంది తిరుమల శ్రీవారికి అభిషేకాల సమయంలో ఈ పునుగు పిల్లి నుంచి వచ్చే తైలాన్ని ఉపయోగిస్తారు తిరుమలతో పాటుగా చిత్తూరు, తిరుపతి,కడప జిల్లాలలో విస్తరించి ఉన్న శేషాచలం అటవీ ప్రాంతంలో ఈ పునుగు పిల్లలు ఎక్కువగా ఉండేవి. ఈ పునుగు పిల్లలు అటవీ ప్రాంతాన్ని విడిచి అప్పుడప్పుడు మాత్రమే బయటికి వచ్చి కనిపిస్తుంటాయి ఈ పునుగు పిల్లులు అంతరించిపోతున్న జీవుల్లో ఒకటిగా ఉంది ఒకానొక సమయంలో ఈ జాతి పిల్లులు శేషాచలం అటవీ ప్రాంతంలో అంతరించిపోయాయని అటవీ శాఖ గణంకాలు చెబుతున్నాయి అందుకోసమే వీటి సంరక్షణ కోసం టీటీడీ ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది వీటి కోసం ప్రత్యేకంగా నిధులు కూడా కేటాయిస్తున్న సంగతి తెలిసిందే తిరుమల శ్రీవారి అభిషేకానికి వాడే పునుగు తైలం కోసం ఈ పునుగు పిల్లలను పెంచుతున్నారు. ఈ పిల్లుల సంరక్షణ కోసం తిరుపతి జూ పార్కులో ప్రత్యేక సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు 2024 డిసెంబర్ 24న టీటీడీ పాలకమండలి సమావేశంలో వీటి సంరక్షణ కోసం ప్రత్యేకంగా నిధులు కూడా కేటాయించారు ఈ పునుగు పిల్లుల సంరక్షణ కోసం అత్యాధునిక సౌకర్యాలు కల్పిస్తున్నారు గతంలో ఈ పిల్లులను టీటీడీ గోశాలలో, పూజారుల ఇల్లలలో పెంచేవారు కానీ అటవీ చట్టం ప్రకారం వాటి పెంపకం పై నిషేధం ఉండటంతో వాటిని జూ పార్కు తరలించి సంరక్షిస్తున్నారు.

# నేటి నుంచి 8వ తేదీ వరకు తిరుమలలో శ్రీ పద్మావతి పరిణయోత్సవాలు

- ఏర్పాట్లు పూర్తి



**తిరుమల,మే 05,మనం న్యూస్:** శ్రీ పద్మావతి శ్రీనివాసుల పరిణయోత్సవాలు ఈ రోజు నుండి 8వ తేదీ వరకు తిరుమలలో ఘనంగా జరుగనున్నాయి. టిటిడి గార్డెన్ విభాగం ఆధ్వర్యంలో పరిణయోత్సవ మండపాన్ని అత్యంత సుందరంగా అలంకరించారు. నారాయణగిరి ఉద్యానవనాల్లోని పరిణయోత్సవ మండపంలో ఈ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. మూడురోజులపాటు జరుగనున్న ఈ వేడుకలో తొలిరోజు శ్రీ మలయప్పస్వామివారు గజవాహనం, రెండవరోజు అశ్వవాహనం, చివరిరోజు గరుడవాహనంపై వేంచేపు చేస్తారు. మరోపక్కఉభయనాంచారులు ప్రత్యేక పల్లకీలలో పరిణయోత్సవ మండపానికి వేంచేపు చేస్తారు. ఆ తరువాత కల్యాణమహోత్సవం కన్నుల పండుగగా నిర్వహిస్తారు.

**ఆర్జిత సేవలు రద్దు :**

శ్రీ పద్మావతి పరిణయోత్సవాలు సందర్భంగా మే 6 నుండి 8వ తేదీ వరకు ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

**పౌరాణిక ప్రాశస్త్యం :**

పురాణాల ప్రకారం సుమారు ఐదు వేల ఏళ్ల కిందట, అంటే కలియుగం తొలినాళ్లలో సాక్షాత్తు వైకుంఠం నుండి శ్రీమహావిష్ణువు శ్రీ వేంకటేశ్వరునిగా భూలోకానికి తరలివచ్చారు. ఆ సమయంలో నారాయణవనాన్ని పరిపాలిస్తున్న ఆకాశరాజు తన కుమార్తె అయిన శ్రీ పద్మావతిని శ్రీవేంకటేశ్వరునికిచ్చి వివాహం చేశారు. ఆకాశరాజు వైశాఖశుద్ధ దశమి శుక్రవారం పూర్వ ఫల్గుణి నక్షత్రంలో నారాయణవనంలో కన్యాదానం చేసినట్లుగా శ్రీ వేంకటాచల మహాత్మ్యం గ్రంథం తెలుపుతోంది.

ఆనాటి పద్మావతీ శ్రీనివాసుల కల్యాణోత్సవ ముహూర్తానికి గుర్తుగా ప్రతి వైశాఖ శుద్ధ దశమినాటికి ముందు ఒక రోజు, తరువాత ఒక రోజు కలిపి మొత్తం మూడురోజుల పాటు పద్మావతీ పరిణయోత్సవాన్ని టీటీడీ నిర్వహిస్తోంది. 1992వ సంవత్సరం నుంచి ఈ ఉత్సవం జరుగుతోంది. ఆనాటి నారాయణవనానికి ప్రతీకగా తిరుమల నారాయణగిరి ఉద్యానవనంలో శ్రీ పద్మావతీ పరిణయ వేడుకలు జరగడం విశేషం.

## యదా యదాహి ధర్మస్య...

కాశ్మీర్ అందాలు కన్నీరు పెడుతున్నాయి
రమణీయ కమనీయ దృశ్యమాలికలు
దిక్కుతోచక బిక్కమొహం వేస్తున్నాయి
పచ్చని బయలు ఎఱ్ఱని రక్తంతో తడిసి
రోదనలు చేస్తున్నాయి...

మూడొందల డెబ్బై అధికరణం దాటి
నిజమైన స్వాతంత్రం వచ్చిందని
సంబరపడు తున్న తరుణాన
సుందర దృశ్యాలతో ప్రపంచాన్ని నిబ్బరపరచి
కీర్తి పతాకం ఎగురుతున్న సమయాన

రక్కసి మూకల రాక్షసకేళి
మతమౌఢ్యాన్ని పూసుకున్న మానవ మృగాలు
హృదయవిదారకంగా విరుచుకుపడ్డాయి
కనికరం లేని కర్కశ హృదయాలు
భరించలేని అకృత్యాలతో కుటుంబాలను
భయభ్రాంతులను చేసాయి

దైవానికి కళ్ళు లేవా!
దయాదాక్షిణ్యాలు లేవా!!
అమాయకుల ప్రాణాలు తీస్తున్న
రక్కసుల హతమార్చలేవా !!!


యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారతః
భారతావనికి గ్లాని జరిగింది స్వామి
అవతారపురుషుడవై అవతరించి
ఉగ్రవాదాన్ని తుద ముట్టించి
ప్రపంచశాంతిని నెలకొలుపు స్వామి
సర్వేజనా సుఖినోభవంతు
లోకాస్తమస్త సుఖినోభవంతు

– నంబి రాజేంద్ర శర్మ
9491365421

# అస్తమాను జయించవచ్చు!



దీర్ఘకాలిక అసాంక్రమిక లేదా అంటువ్యాధి కాని (నాన్ కమ్యూనికబుల్ డిసీజ్) వ్యాధుల్లో అస్తమా లేదా ఉబ్బసం అతి ప్రధానమైనది. ప్రపంచ్యాప్తంగా సాలీనా 260 మిలియన్ల ప్రజలు ఈ వ్యాధితో బాధపడడం, అందులో 4.5 లక్షల వరకు మరణాలు కూడా సంభవిస్తున్నాయని అంచనా. పిల్లలు, యువతలో కూడా 15 శాతం వరకు నమోదు అవుతున్న అస్తమా వ్యాధి తగు జాగ్రత్తలతో ప్రాణాలను కాపాడుకోవచ్చని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అస్తమా దాడి లేదా అస్తమా అటాక్ జరగడం వల్ల రోగుల్లో నిరాశ, కుటుంబ సభ్యుల్లో ఆందోళనలు పెరగడం, ఆసుపత్రి పాలు కావడం, చివరకు ప్రాణాలు కూడా పోవడం జరగవచ్చు. అల్ప-మధ్య ఆదాయ దేశాల్లో వైద్య సదుపాయాలు కొరవడడం, కార్టికోస్టీరాయిడ్ ఇన్హేలర్ ఔషధాల ధరలు అధికంగా ఉండడంతో అస్తమా కారణ మరణాలు 96 శాతం వరకు నమోదు కావడం విచారకరం. భారత్లో అత్యధిక ఉబ్బస రోగులు ఉన్నట్లు, మరణాలు కూడా 3.4 కోట్ల వరకు నమోదు అవుతున్నట్లు గణాంకాలు తెలుపుతున్నాయి.



**ప్రపంచ అస్తమా దినం-2025:**

1998లో గ్లోబల్ ఇనిషియేటివ్ ఫర్ అస్తమా చొరవతో మే మాసపు తొలి మంగళ వారం (అనగా 06 మే 2025) రోజున ప్రారంభమైన ప్రపంచ అస్తమా దినం ద్వారా ఉబ్బస వ్యాధి పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడం, తీసుకోవలసిన జాగ్రత్తలను ప్రచారం చేయడం, అస్తమా రోగులకు ఆత్మవిశ్వాసం పెంచడం, కుటుంబాలకు ధైర్యాన్ని అందించడం, ఆధునిక పరిశోధనలతో ఉత్తమ చికిత్స విధానాలను రూపొందించడం లాంటి అంశాల ఎజెండాగా ప్రపంచ ఉబ్బస దినం వేదికలను వాడుకుంటున్నారు. 2025 ప్రపంచ అస్తమా దినం ఇతివృత్తంగా మేక్ ఇన్హేలర్ ట్రీట్మెంట్స్ అక్సెసిబుల్ ఫర్ ఆల్ అనబడే అంశాన్ని తీసుకొని విస్తృత అవగాహన కలిపించడం కొనసాగుతున్నది. సరైన ఔషధాలను వాడుతూ ఉబ్బసాన్ని, ఉబ్బస దాడిని అదుపు చేసుకోవచ్చనే ధైర్యాన్ని కల్పించడం ప్రధాన ఉద్దేశంగా తోస్తున్నది.

**అస్తమా అదుపుకు తీసుకోవలసిన ముందు జాగ్రత్తలు, ఔషధాలు:**

అస్తమాను తగు జాగ్రత్తలతో నిరోధించవచ్చు. కలుషిత గాలి, శీతల గాలులు, పూల సుగంధ పరిమళాలు, దుమ్ము ధూళి, సిగరెట్టు పొగలు, బాణాసంచా కాల్చడం, అగరు వత్తులు పొగలు, ఫేస్ పౌడర్ పీల్చడం, ఎలర్జీకి కారణమయ్యే వాటికి దూరంగా ఉండడం వల్ల ఉబ్బసం వ్యాధి నివారించబడుతుంది లేదా వ్యాధిగ్రస్థుల్లో ఉపశమనం కల్పించబడుతుంది. వీటితో పాటు రోగులకు దూరంగా ఉండడం, శీతల వాతావరణాలకు దూరంగా ఉండడం, ఇల్లు/ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, అందుబాటులో ఉన్న అన్ని వ్యాధుల కట్టడికి టీకాలను తీసుకోవడం, వైద్యుల సూచనలతో తగు ఔషధాలను విధిగా వాడడం తప్పనిసరిగా చేయడానికి ప్రయత్నించాలి. ప్రపంచవ్యాప్తంగా అస్తమాను తగు జాగ్రత్తలతో నిరోధించడంతో పాటు రోగులకు సరైన సూచనలు చేయడం, అన్ని ప్రాంతాల్లో ఉబ్బస వ్యాధి ఔషధాలను తక్కువ ధరలకే అందుబాటులో ఉంచడం, అస్తమా విద్యను విస్తరించడం, ఉబ్బస రోగులను/పౌర సమాజాన్ని శక్తివంతం చేయడం నేటి కనీస అవసరంగా పేర్కొనబడుతున్నది.

అస్తమా మరణాలను తగ్గించడం, అస్తమా రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను ప్రచారం చేయడం తక్షణ కర్తవ్యంగా ప్రభుత్వాలు, పౌర సమాజం భావించాలి. పేదరికం, అవగాహనలేమి, అపరిశుభ్ర వాతావరణం, పోషకాహారం కొరవడడం, ఔషధాలు తీసుకోకపోవడం, వైద్య సదుపాయాల కొరత లాంటివి అస్తమాను ప్రాణాంతక వ్యాధిగా మార్చుతున్నాయి. మన ఊరు వాడల్లో అస్తమా రోగులు ఉన్నట్లయితే తగు జాగ్రత్త సూచించడంతో పాటు పరిసరాల పరిశుభ్రత ప్రాధాన్యాన్ని వివరించడం మనందరి కనీస బాధ్యత.

(06 మే ప్రపంచ అస్తమా దినం సందర్భంగా)

–డా. బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

## దాటేదెలాగో

ఎదురుపడితే
తప్పుకు పోతున్న మనా తనా
కొలువు జారిపోయి
బంధాలలో పగుళ్ళు

సంసార దీపాన్ని
ఎంతకీ వెలిగించని
రూకలేని ప్రేమలైటర్

లేనివాటి ధాటికి
ఉన్నవీ లేనట్టే

చావు పుట్టుకల
మోయలేని బరువు

పుచ్చుకున్నది కక్కలేక
రేపుమాపన్న మాటలకు
తెగిపోయిన మర్యాద

ఏదీ ఆగదు
ఏదీ తప్పదు

లోపల బతకలేక
బయట చావలేక
దాటేదెలాగో
ఈ మలుపుని

– కళ్ళేపల్లి తిరుమలరావు
9177074280

## కాశ్మీరం కాళికావతారం !!

మన భారత మాత మకుటం
కాశ్మీర్ నుండి
ఇపుడు కాంతులు కాదు
జ్వాలలు రేగుతాయి !
ఇక పాక్ ప్రేరేపిత
ఉగ్రవాద గుంపులు
భస్మీపటలం !
దేశపటంలోంచి మాయం !!

ప్రపంచ శాంతిని కాక్షించే
భారత దేశం అనివార్యమైనపుడు
ఫిరంగులతో పిడుగులు కురిపించగలదు!
అందమైన కాశ్మీరం
కాళికావావతరం ఎత్తుతుంది !
కాళిక నాళిక చాస్తుంది
ఉగ్రమూక ఉఫ్ గాలికి ధూళికే!!

– కందాళై రాఘవాచార్య
8790593638

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.
– ఎడిటర్

# ‘గ్రూప్స్’ ఉద్యోగాల్ని భర్తీ చేయాలి..!



తెలంగాణలో ప్రభుత్వ నియమకాల్ని చేపట్టేందుకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపిఎస్సీ) ఏర్పాటై పదేళ్లు గడిచింది. ఈ పదేళ్లలో నలుగురు చైర్మన్లు మారారు. ప్రభుత్వాలు మారాయి, అయినా నిత్యం ఏదో ఒక వివాదం టీజీపీఎస్సీని కుదిపేస్తోంది. టీజీపిఎస్సీ అధికారిక వెబ్ సైట్ లో దాదాపు ఇరవై ఐదు లక్షల మందికి పైగా నిరుద్యోగ యువత తమ విద్యార్హత వివరాల్ని నమోదు చేసుకున్నారు. గ్రూప్ 1,2,3,4 వంటి పరీక్షలకు తెలంగాణ వ్యాప్తంగా లక్షలాది మంది నిరుద్యోగ యువత సన్నద్ధం అవుతారు.. పోటీ పరీక్షల్లో విజయం సాధించడం అంటే అది మామూలు విషయం కాదు.. విజయం సాధించడంలో చాలా కారణాలు ప్రభావితం చేస్తాయి. లక్షల్లో అభ్యర్థులుంటే వందల్లో మాత్రమే ప్రభుత్వ ఉద్యోగాలు ఉంటాయి..అందరికీ ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వడం సాధ్యం కాదని అందరికీ తెలుసు కానీ వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను కూడా భర్తీ చేయడానికి ఏండ్లకు ఏండ్ల సమయం ఎందుకు పడుతుందన్నదే నిరుద్యోగ యువత సంధించే ప్రశ్న.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రూప్ వన్ నోటిఫికేషన్ జారీ చేసినపుడు ఎ_55 తీసుకువస్తే కాంగ్రెస్ ప్రభుత్వం దాని స్థానంలో ఎ_29 తీసుకువచ్చింది. ఒక వేళ నిజంగానే కొత్తగా తీసుకువచ్చిన ఎ_29 వల్ల అభ్యర్థులకు మేలు జరుగుతుందని కమిషన్ భావిస్తే ఈ జీ.ఓ వివాదాస్పదం అయ్యేంత వరకు, ఈ విషయాన్ని పరీక్షలు రాసే అభ్యర్థులకు అర్థం అయ్యేలా వివరించే ప్రయత్నం ఎందుకు చేయలేదు? న్యాయస్థానాల వరకు వెళ్ళాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందో ఆత్మ పరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉంది. టీజీపిఎస్సీ సమర్థవంతంగా పరీక్షలను నిర్వహించి వరుసగా ఫలితాలు విడుదల చేయడం వల్ల తెలంగాణ నిరుద్యోగ యువతకు టీజీపిఎస్సీ మీద విశ్వసనీయత పెరుగుతుంది. పారదర్శకంగా, నిబద్ధతతో ముందుకు వెళ్తూ అభ్యర్థులకు ఉండే సందేహాలను నివృత్తి చేస్తేనే అసత్య ప్రచారాలకు అడ్డుకట్ట పడుతుంది. లేదంటే అర్థం చేసుకోవడం కన్నా అపార్థం చేసుకోవడం సులభం. ప్రశ్న పత్రాల తయారీ నుండి మొదలుకుని పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం, ఫలితాల విడుదల అభ్యర్థుల




ఎంపిక ఇలా క్రమ పద్ధతిలో పారదర్శకతతో వెళ్తేనే టీజీపీఎస్సీ రాష్ట్రానికి మెరుగైన ప్రభుత్వ ఉద్యోగుల్ని అందించగలదు..

ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి,విలువైన తమ సమయాన్ని వెచ్చించి, వందల్లో ఉద్యోగాలు ఉంటే లక్షల మంది అభ్యర్థులతో పోటీ పడతారు. వీళ్ళలో ఎవరికీ పరీక్షలు వాయిదా పడాలని కానీ, కోర్టుల్లో కేసులు వేయాలనే ఆలోచన ఉండదు ..వారికి కావాల్సింది ఒక ఉద్యోగం మాత్రమే.,దానితో వారి కుటుంబ పోషణ, సమాజంలో ఒక ప్రభుత్వ ఉద్యోగిగా గుర్తింపు, ఉద్యోగ భద్రత ఇంతకు మించి ఏమీ ఆశించరు, గతంలో దాదాపు పదికి పైగా ప్రశ్న పత్రాలు లీక్ అయ్యాయి, పరీక్షలు వాయిదా పడ్డాయి, నిందితుల కోసం ప్రభుత్వం సిట్ వేసింది, సూత్ర దారులు, పాత్ర దారులు, దోషులు ఎవరో తేల్చితే వారిని తెలంగాణ సమాజం ముందుంచే ప్రయత్నం ఎందుకు చేయట్లేదనేది అభ్యర్థులు అడుగుతున్న ప్రశ్న.గ్రూప్ 1 మెయిన్స్ ఎంపికలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ కి 1:1 నిష్పత్తిలో పిలిచారు. ఆ 1:1 లో అందరికీ ఉండాల్సిన సర్టిఫికెట్లు ఉండకపోవచ్చు, లేదా కొంతమంది వారికి నచ్చిన పోస్టు రానపుడు అనాసక్తి వ్యక్తం చేస్తూ ఉద్యోగంలో చేరకపోతే మళ్ళీ కింది నుండి అభ్యర్థులను పిలిచే బదులు ముందే గ్రూప్ 1, గ్రూప్ 2 లాంటి ఉద్యోగాలకు 1:2 నిష్పత్తిలో ఎంపిక చేసే ప్రయత్నం ఎందుకు చేయట్లేదు. గ్రూప్ వన్ మెయిన్స్ లో ఇంటర్వ్యూ కూడా లేదు డైరెక్ట్ గా 1:1 నిష్పత్తిలో ఎంపిక అంటే సమంజసమేనా..?

ఒకే ఏడాది గ్రూప్ 1,2,3 వంటి పరీక్షలు జరగడం వల్ల, దాదాపు ఒకే సిలబస్ ఉండడం వల్ల కొంతమంది అభ్యర్థులకు రెండు లేదా మూడు ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంటుంది. కాబట్టి గ్రూప్ 3 వంటి పోస్టులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ కి పిలిచినపుడు 1:3 పిలిస్తే ఇబ్బంది ఏముంటుంది..? వెరిఫికేషన్ కు మరో వారం రోజుల సమయం పట్టొచ్చు, కానీ పోస్టులు మిగిలి పోకుండా పూర్తిగా భర్తీ అయ్యే అవకాశం ఉంటుంది కదా.. సర్టిఫికెట్ వెరిఫికేషన్ కి 1:2 లేదా 1:3 లో పిలిస్తే అభ్యర్థులకు ఉద్యోగం పట్ల ఆశలు రేకెతిచ్చినట్లవుతుందని చెప్తున్నారు..అలా ఎందుకు అనుకోవాలి ఈ సారి సర్టిఫికెట్ వెరిఫికేషన్ కి వెళ్ళిన వారికి ఉద్యోగం రాకుంటే అడుగు దూరంలో ఆగి పోయాం.. ఇంకా శ్రమించాల్సి ఉంటుందనుకునే వాళ్ళు కూడా ఉంటారు కదా. సర్టిఫికెట్ వెరిఫికేషన్ కు తక్కువ మందిని పిలువడం వల్ల పోస్టులు పూర్తి స్థాయిలో భర్తీ కాకుండా మిగిలిపోయే అవకాశం ఉంటుంది.గ్రూప్స్ పరీక్షల సిలబస్‌లో మార్పు ఉంటుందంటూ వార్తలు వస్తున్న నేపథ్యంలో ఏ యే అంశాలు మారుతాయో ముందుగానే స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.వాటికి ప్రామాణిక పుస్తకాల్నికూడా తెలియజేస్తే బాగుంటుంది. రాబోయే గ్రూప్ వన్ లాంటి పరీక్షలో తెలుగును క్వాలిఫైయింగ్ పేపర్(కనీస అర్హత) గా పెట్టాలని, డేటా ఇంటర్ ప్రిటేషన్ స్థానంలో ఎథిక్స్ ను చేర్చాలని నిరుద్యోగ యువత డిమాండ్ చేస్తున్నారు.ఇప్పటికైనా టీజీపీఎస్సీ పరీక్షల నిర్వహణ పట్ల నిరుద్యోగ యువతకున్న అనుమానాల్ని నివృత్తి చేయాలి. అప్పుడే టీజీపీఎస్సీ పట్ల నిరుద్యోగ యువతకు విశ్వసనీయత మరింత పెరిగేది. రానున్న రోజుల్లో జాబ్ క్యాలెండర్ ను విడుదల చేసి దాని ప్రకారం ఎప్పటికప్పుడు ఖాళీగా ఉన్న ఉద్యోగాలను పారదర్శకంగా భర్తీ చేస్తేనే పోరాడి సాధించుకున్న తెలంగాణలో నిరుద్యోగ యువతకు న్యాయం జరుగుతుంది. ఆ దిశగా ప్రభుత్వం, టీజీపీఎస్సీ పయనించాలన్నదే తెలంగాణ యువత ఆకాంక్ష..

– డా. అశోక్ మంద
9959046499

# రష్యా, చైనా సహకారం

అమెరికాతో వాణిజ్య యుద్ధం చేస్తున్న చైనా రష్యాను మచ్చిక చేసుకోవాలనే తలంపుతో, చైనా దేశాధ్యక్షుడు జిన్‌పింగ్ ఈనెల లో 4 రోజులు రష్యా పర్యటనకు వెళుతున్నారు. రెండవ ప్రపంచ యుద్ధ వేడుకలలో రష్యా ఆహ్వానం మేరకు తాము వెళుతున్నామని జిన్‌పింగ్ పేర్కొన్నారు. రెండవ ప్రపంచ యుద్ధంలో జర్మనీ చేతులు ఎత్తేయడంతో బెర్లిన్‌లో ఆడాల్ఫ్ హిట్లర్ ఆత్మహత్య చేసుకున్నారు. 1945లో రిచ్ స్టాగ్‌పై సోవిట్ జెండా రెపరెప లాడింది. రష్యా సాధించిన విజయానికి చైనా ప్రశంసించింది. రష్యాలో ఈ వేడుకలు అత్యంత భారీగా జరగబో తున్నాయి. చైనాతోపాటు ఈ వేడుకలలో బ్రెజిల్, సెర్బియా, స్లోవేకియా మొదలగు దేశాధి నేతలు రష్యాకు వస్తున్నారు. వీరందరికి భద్రత కల్పించవలసిన బాధ్యత రష్యాపై ఉంది. రెండవ ప్రపంచ యుద్ధంలో రష్యా అతి భారీగా పౌరులను, రక్షణ సిబ్బందిని కోల్పోయింది. ఒక ప్రక్క విజయం సిద్ధించినా, భారీగా నష్టపోవడంతో సాధించిన విజయంతో విక్టరీ వేడుకలు ఘనంగా జరుపుకోవాలని ఆదే తమ సైనికులకు పౌరులకు తామిచ్చే నివాళి అని రష్యా భావిచడం గమనార్హం. ఈ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా జిన్‌పింగ్ పాల్గొంటున్నారు. చైనా, రష్యాల మధ్య సంబంధాలు మెరుగు పడిన దృష్ట్యా సంబంధాలు వ్యూహాత్మక సంప్రదింపులు మెరుగు అవుతున్నాయని భోగట్టా. రెండు దేశాలు సమగ్ర బాగస్వామ్యం, అంతర్జాతీయ పరిణామాలు మొదలగు వాటిపై పుతిన్, జిన్‌పింగ్ చర్చలు జరుపుతారు. రష్యాలో జరుగుచున్న విక్టరీ వేడుకలను ఉక్రెయిన్ ఓ కంట కనిపెడుతూనే ఉంది. వేడుకలలో దాడి చేయడమా!వద్దా! అనే ఆలోచనలో ఉంది. ఒక వేళ రష్యాపై దాడి చెస్తే ప్రపంచ దేశాలు ఉక్రెయిన్‌ను తిట్టి పోస్తాయి. ఉక్రెయిన్ పన్నాగాం తెలిసే రష్యా మూడు రోజులు కాల్పుల విరమణ పాటిస్తున్నామని చెప్పింది. దీనికి ఉక్రెయిన్ మూడు రోజులు కాదు ముప్పై రోజులు కాల్పులు లేకుండా చూడాలి అని బదులు ఇచ్చింది. ఇలా పరస్పర ధోరణిలో రెండు దేశాలు ఉన్నాయి. రష్యాలోని విక్టరీ వేడుకలకు వస్తున్న వివిధ దేశాల నాయకులకు ఉక్రెయిన్ మేము వారికి ఎట్టి భద్రత కల్పించలేం అని చెప్పడం, రష్యాను ఆశ్చర్య పరచింది. విక్టరీ వేడుకలకు ఏదయినా ఆటంకం కలిగితే రష్యా ఫోకస్ ఉక్రెయిన్ పైనే ఉంటుంది. ఉక్రెయిన్ , రష్యా కాల్పుల విరమణ మూడు రోజులు పాటిస్తున్నాం అనే ప్రకటనను ఉక్రెయిన్ హుందాగా తీసుకొని ఉంటే బాగుండేది. ఎటువంటి ఆటంకాలు జరగకపోతే రష్యా వేడుకలు విజయ వంతం అయినట్లే. ఉక్రెయిన్ కూడా సంయమనం పాటించాలి. రష్యా రెండవ ప్రపంచ వేడుకలు సజావుగా సాగితే ఉక్రెయిన్‌పై దాడి ఉండక పోవచ్చు. ఏదైనా అపశృతి దొర్లితే మాత్రం రష్యా తీసుకునే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. ముఖ్యంగా ఈ వేడుకలకు జిన్‌పింగ్ రావడం ఒక ప్రాముఖ్యత. ఎందుకంటే ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో రష్యా, చైనా శాశ్వత సభ్య దేశాలు. అమెరికా కూడా శాశ్వత సభ్య దేశమైనా చైనాతో అమెరికాకు సంబంధాలు అడగంటాయి, రష్యాతో కూడా ఒక ప్రక్క మద్దతు ఇస్తూనే ఉక్రెయిన్‌తో ఖనిజ ఒప్పందం చేసుకుంది. ఇది రష్యాకు మింగుడు పడని విషయం. అందుకే అమెరికాతో మాటలు యుద్ధం చేస్తున్న చైనాను ఆహ్వానించింది. ఇప్పుడు రష్యా, చైనా సహకారం విశ్వంలో బలమైనది. దీనికి తోడు ఉత్తర కొరియా కూడా రష్యాకు అండగా ఉండటం రష్యాకు కలసి వచ్చిన అంశం. ఉక్రెయిన్ మాత్రం అగ్రరాజ్యం పైనే ఎక్కువ ఆశలు పెట్టుకుంది. విక్టరీ వేడుకలలో ఏదయినా దాడి జరిగితే మాత్రం ఉక్రెయిన్‌పై ముప్పెట దాడి ఉంటుంది. ఇటువంటి దాడులకు అమెరికా కూడా మద్దతు ఇవ్వకూడదు. అమెరికా అండ ఉంటుంది అనే మిష తోనే ఉక్రెయిన్ ఉంది.ఒక వేళ ఉక్రైన్, రష్యా పై దాడి చెస్తే మాత్రం అమెరికాకు చెడ్డ పేరు వస్తుంది. కనుక ఉక్రెయిన్ వేచి చూడటమే శ్రేయస్కరం. ఈ దిశలో చైనా, రష్యా సంబంధాలు పటిష్టం అవుతాయి అనడంలో సందేహం లేదు.

– కనుమ ఎల్లారెడ్డి
93915 23027

# చూపు ఫోన్ పై కాదు... లక్ష్యం పై ఉండాలి



ఇటీవల భారత్‌లో విడుదలైన సివిల్స్ ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వ్యక్తుల ఇంటర్వ్యూలను వార్తా పత్రికలలో చూసినపుడు చాలా మంది కూడా నా ఈ అత్యుత్తమ ర్యాంక్ రావడానికి ప్రధాన కారణం మొబైల్ ఫోన్ వాడలేదు అందుకే సాధించ గలిగాను అనే వాక్యాలు నిజంగానే మొబైల్ ఫోన్ వాడితే అంత నష్టం జరుగుతుందా.... యువతను ఆలోచనలో పడేసినట్లు అయ్యింది.

నేటి డిజిటల్ యుగంలో మొబైల్ ఫోన్ అనేది మన జీవనశైలిలో తప్పనిసరిగా మారిపోయింది. సమాచారాన్ని సులభంగా పొందడానికి, ప్రపంచంతో అనుసంధానం కోసం, మన వృత్తిపరమైన పనులు నిర్వహించడానికి కూడా ఇది అవసరమైన సాధనమైంది. కానీ, అదే మొబైల్ ఫోన్ మన మానసిక స్థిరత్వాన్ని, ఏకాగ్రతను, భావోద్వేగ నియంత్రణను మెల్లగా దెబ్బతీస్తోంది. నేటి ఆధునిక ప్రపంచంలో మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కూడా విజయం సాధించడంలో ఒక ముఖ్యమైన అంశం. మొబైల్ ఫోన్ను నియంత్రించడం ద్వారా మనం మన స్వీయ నియంత్రణను మెరుగుపరుచుకోవచ్చు. ఇది కేవలం చదువులకే కాదు, జీవితం మొత్తానికి కూడా మంచి మార్గనిర్దేశం అవుతుంది. ఏ రోజు కూడా మొబైల్ ఫోన్ వాడలేదు అందుకే సివిల్స్‌లో మంచి ర్యాంక్ అనే వాక్యం, మానసిక స్థిరత్వం మరియు దీర్ఘకాలిక లక్ష్య సాధనానికి ఎంతటి ప్రాధాన్యం ఉన్నదీ స్పష్టం చేస్తుంది.

సివిల్స్ పరీక్షలు వంటి అత్యంత ప్రతిష్ఠాత్మకమైన పోటీ పరీక్షలకు సిద్ధం కావాలంటే ఏకాగ్రత, పట్టుదల, నిర్ణయం తీసుకోవడంలో మెళకువలు చాలా అవసరం. విజయం సాధించడానికి సహనం మరియు నిబద్ధత చాలా ముఖ్యం. అలాంటి సందర్భంలో వరంగల్‌కి చెందిన సాయి శివాని మొబైల్ ఫోన్ వాడకుండా సివిల్స్‌లో మంచి ర్యాంక్ సాధించారు.

సివిల్ సర్వీసుల పరీక్షకు సిద్ధం అవ్వడానికి సమయం కేటాయించడం చాలా ముఖ్యం. ఫోన్ వాడకపోవడం వల్ల సమయం ఆదా అవుతుంది, ఆ సమయాన్ని చదవడానికి మరియు అభ్యసించడానికి ఉపయోగించవచ్చు. సాయి శివాని మొబైల్ ఫోన్ వాడకపోవడం వల్ల తనలో ఉన్న మానసిక స్థితిని ఎంతగానో బలోపేతం చేసిందని చెప్పవచ్చు.

**మొబైల్‌తో మానసిక ఏకాగ్రతపై ప్రభావం**

కాగ్నిటివ్ సైకాలజీలో చెప్పినట్టు, మన మెదడు ఒక సమయంలో పరిమిత సమాచారం మాత్రమే ప్రాసెస్ చేయగలదు. మొబైల్ ఫోన్ వాడకం వల్ల మెసేజ్ లు, సోషల్ మీడియా ద్వారా మన లో ఉన్న ఏకాగ్రతను తగ్గిస్తుంది.

ఇది వర్కింగ్ మెమొరీ లో గందరగోళాన్ని కలిగిస్తుంది, ఎక్కువ మానసిక శాస్త్ర పరంగా, మొబైల్ ఫోన్ వాడకం ఎక్కువైతే డిజిటల్ డిపెండెన్సీపెరిగి, ఏకాగ్రత లోపం ఏర్పడే అవకాశం ఉంటుంది. ఇంటర్నెట్ నోటిఫికేషన్లు, సోషల్ మీడియా అప్డేట్లు మనలో ఓ నిరంతర అస్థిరతను, మనసులో వ్యాకులత ను పుట్టిస్తాయి. ఫలితంగా, దీర్ఘకాలికంగా చదువుపై సమగ్ర దృష్టి పెట్టడం కష్టమవుతుంది.



కాలం నేర్చుకోవాలనే ఆసక్తిని తగ్గిస్తుంది.

**డిజిటల్ డిస్ట్రాక్షన్:** మొబైల్ వాడకంతో చదివేటప్పుడు మధ్య మధ్యలో పదే పదే అటెన్షన్ కోల్పోవడం జరుగుతుంది. దీనినే మనం అటెన్షన్ రెసిడ్యూ అని పిలుస్తారు. ఒక పని నుండి మరొక పనికి మారినపుడు, మన మెదడు పూర్తిగా కొత్త పనిలో మునిగిపోవడానికి కొంత సమయం పడుతుంది. ఈ వరుస మధ్యలో మొబైల్ చూసి తిరిగి చదువుకు వస్తే, కాన్సెంట్రేషన్ పెరుగడానికి ఎక్కువ సమయం పడుతుంది. ఎక్కువగా మొబైల్ వాడడం వల్ల మానసిక ఆందోళన, నిద్ర సరిగా రాకపోవడం, డిప్రెషన్ వంటి మానసిక సమస్యలు పెరుగుతున్నాయని, ఎక్కువ స్క్రీన్ టైం వాడే యువతలో మానసిక అసంతృప్తి స్థాయి ఎక్కువగా ఉన్నట్లు పరిశోధనలు సూచిస్తున్నాయి. సమయ నిర్వహణలో సమస్యలు: టైమ్ మేనేజ్మెంట్ లో అసమర్థత, ముఖ్యంగా నిర్దిష్ట లక్ష్యాలపై పనిచేసే సమయంలో మొబైల్ వాడకం వల్ల అనుకున్న సమయానికి లక్ష్యాన్ని చేరుకోకపోవడం జరుగుతుంది. చదువుకునే సమయానికి పూర్తిగా మొబైల్ దూరంగా ఉంచుకోవడం ద్వారా, అభ్యర్థి మనస్సు పూర్తిగా ఒకే పనిపై దృష్టిని పెట్టె సామర్థ్యాన్ని పొందుతాడు. ఇది నెమ్మదిగా ఫ్లో స్టేట్ లోకి ప్రవేశించేందుకు దోహదం చేస్తుంది. ఫ్లో స్టేట్ అనేది అత్యధిక శక్తి ఉత్పాదకతను, సృజనాత్మకతను మెదడుకు అందిస్తుంది. మొబైల్ వాడకాన్ని నియంత్రించడం (సెల్ఫ్ కంట్రోల్) వల్ల అభ్యర్థి తన తాత్కాలిక సంతోషాన్ని నియంత్రించి, దీర్ఘ కాలిక లక్ష్యాలపై పై దృష్టిపెట్టే శక్తిని పెంపొందించుకుంటారు. ఇది శాశ్వత సంతోషాన్ని అందిస్తుంది అనే భావనకు సంబంధించినది మెరుగుపరచుకోవడం ద్వారా మాత్రమే సాధ్యం అవుతుంది. మొబైల్ డిస్ట్రాక్షన్ల నుంచి దూరంగా ఉండడం, రోజువారీ పాఠ్యాంశాలను పూర్తి చేయడం ద్వారా అభ్యర్థిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. నేను నా లక్ష్యాన్ని చేరుకోగలను అనే భావన పెరుగుతుంది.

**భావోద్వేగ నియంత్రణ:** ఫోన్ వాడకం లేకుండా మానసికంగా ప్రశాంతంగా ఉండటం వల్ల ఒత్తిడి మరియు ఆందోళన తగ్గి ప్రత్యేకించి పరీక్షల సమయం లో పరీక్ష ఆందోళన తగ్గించడానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. మానసిక ఆరోగ్య పరంగా, తక్కువ మొబైల్ వాడకం మానసిక ప్రశాంతతను, భావోద్వేగ నియంత్రణను పెంచుతుంది. ఇది పరీక్ష సమయాల్లో ఒత్తిడిని తగ్గించి, ఉత్తమ ప్రతిభను ప్రదర్శించడానికి దోహదం చేస్తుంది.

– డా.అట్ల శ్రీనివాస్ రెడ్డి
9703935321

# మహిళలు మామోగ్రామ్ పరీక్ష చేయించుకోవాలి

- వైద్యాధికారి డాక్టర్ డి.బిందు ప్రియాంక
- స్విమ్స్ ఆధ్వర్యంలో దగ్గవోలు, సంగనపల్లిలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్



**తిరుపతి,మే 05,మనం న్యూస్:**ప్రాథమిక దశలో రొమ్ము క్యాన్సర్ ను గుర్తించేందుకు 35 ఏళ్లు దాటిన మహిళలందరూ మామోగ్రామ్ పరీక్ష చేయించుకోవాలని డక్కిలి పిహెచ్ సి వైద్యాధికారిణి డాక్టర్ డి.బిందు ప్రియాంక కోరారు. తిరుపతి శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ(స్విమ్స్) ఆధ్వర్యంలో సోమవారం డక్కిలి మండలం డక్కిలి పిహెచ్ సిలోని దగ్గవోలు, సంగనపల్లి గ్రామాల్లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు.

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో తిరుపతి జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వేగవంతంగా జరుగుతోంది. బిపి, షుగరు పరీక్షలతోపాటు పింక్ బస్సులో మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ కోసం పాప్ స్మియర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. మహిళలు, పురుషులు విశేషంగా విచ్చేసి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకున్నారు.

**పింక్ బస్సుల క్యాంపులు జరిగే ప్రదేశాలు**

- మే 8న లింగసముద్రం, శ్రీపురం.
- మే 12న మాధవాయపాళెం, తీర్థంపాడు.
- మే 15న మోపూరు, వెలికల్లు.
- మే 19న నాగవోలు, వెంబులియూరు.
- మే 22న పాలుగోడు.

స్విమ్స్ డైరెక్టర్ కమ్ వైస్ చాన్సలర్ డాక్టర్ ఆర్వీ కుమార్ ఆదేశాల మేరకు కమ్యూనిటి మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కె.నాగరాజ్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమాల్లో స్విమ్స్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ చైతన్య భాను, డాక్టర్ పద్మావతి, సర్పంచులు ఆర్.చిరంజీవి, కోలా చిన్నమ్మ, పంచాయతీ కార్యదర్శులు ఎం.రమేష్, వెంకటాద్రి, శిరీష, స్థానిక నాయకులు మస్తాన్, వై.ఉదయకుమార్, కె.రాఘవేంద్రరావు, గంగోటి వినోద్ కుమార్, గరిటి చెంచయ్య, గంట రవి చందర్, ఉడతల సీనయ్య, చిట్టేటి పెంచలయ్య, ఎమ్ఎల్ హెచ్ పిలు ఎం.అనిత, ఏఎన్ఎంలు కె.కామాక్షి, ఎం.నాగమణి, స్థానిక వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## ఆల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు టోపీలు పంపిణీ

**జూపాడుబంగ్లా మే 5 (మనం న్యూస్):** జూపాడుబంగ్లా మండల అల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండల ప్రజాపరిషత్ కార్యాలయం నందు జర్నలిస్టులకు టోపీలు పంపిణీ చేసిన ఎమ్మార్వో చంద్రశేఖర్ నాయక్, ఎంపీడీవో గోపికృష్ణ.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టులు ఎండనక వాననక ఆరోగ్యాన్ని కూడా లెక్క చేయకుండా న్యూస్ కవరేజ్ నిమిత్తం వెళ్తుంటారని, కొన్ని సందర్భాలలో గంటల తరబడి ఎండలలో న్యూస్ కవరేజ్ చేయవలసి ఉంటుందని, అలాంటి సందర్భాలలో జర్నలిస్టులకు ఈ టోపీలు ఎంతగానో ఉపయోగపడతావన్నారు. అనంతరం అల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బి ఆనంద్ కుమార్ మాట్లాడుతూ ఈ వేసవి కాలంలో ఎండలు ఎక్కువగా ఉండడంతో జర్నలిస్టులకు వడదెబ్బ తగలకూడదని ఉద్దేశంతో మా ఆల్ వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో టోపీలు పంపిణీ చేయడం జరిగిందని, అందులో భాగంగానే నేడు ఎమ్మార్వో చంద్రశేఖర్ నాయక్, మరియు ఎంపీడీవో గోపికృష్ణ వారి చేతుల మీదుగా పంపిణీ చేయడం చాలా సంతోషకరంగా ఉందని ఇందుకు సహకరించిన వారందరికీ ధన్యవాదములు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఏఈ నాగేంద్ర, హౌసింగ్ ఏఈ జ్యోతి, ఏపీఎం అంబవ్మ్మ, మరియు జర్నలిస్టులు గోవర్ధన్, నాగభూషణం,నజీర్, రామకృష్ణ, చంద్రశేఖర్, నాగేశ్వరరావు, సురేంద్ర, తదితర జర్నలిస్టులు పాల్గొన్నారు.



## మార్క్సిస్టు మేధావి కారల్ మారక్స్ కు ఘన నివాళి

- దేవనకొండలో ఘనంగా కారల్ మారక్స్ జయంతి

**దేవనకొండ,మే 05మనం న్యూస్:** మార్క్సిస్టు మహోపాధ్యాయుడు, ప్రపంచ మేధావి, తత్వవేత్త అయిన కారల్ మారక్స్ జయంతిని ఘనంగా నిర్వహించినట్లు సిపిఐ మండల కార్యదర్శి ఎమ్. నరసరావు, మండల సహాయ కార్యదర్శి ఎం. వెంకటేశ్వర్లు, రైతు సంఘం మండల సీనియర్ నాయకులు వై. కండప్ప లు తెలిపారు. సోమవారం కారల్ మారక్స్ 207 వ జయంతి సందర్భంగా దేవనకొండ నందు గల సిపిఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రపంచ చరిత్రను మార్చిన మహా మేధావి, మార్క్సిస్టు మహోపాధ్యాయుడు, తత్వవేత్త అయిన ₹కారల్ మారక్స్ ప్రపంచ గతిని మార్చిన మహోన్న వ్యక్తి అని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు శేఖర్,కృష్ణ, వీరాంజనేయులు, నాగేంద్ర, కోదండ, సుబ్బయ్య, రామాంజనేయులు, విద్యార్థి, యువజన సంఘం నాయకులు భాస్కర్, రామంజి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా జాతర ఏర్పాట్లు పక్కాగా చేపట్టండి

- కమిషనర్ ఎన్.మౌర్య



**తిరుపతి,మే 05,మనం న్యూస్:**భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా గంగ జాతర ఏర్పాట్లు పక్కాగా చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. ఈ నెల 6 నుండి ప్రారంభం కానున్న తాతయ్య గుంట గంగమ్మ జాతర కు జరుగుతున్న ఏర్పాట్లను సోమవారం ఉదయం వివిధ శాఖల అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. ఆలయంలో అమ్మవారి దర్శనానికి భక్తుల కొరకు చేసిన ఏర్పాట్లు, ఇందిరామైదానం, క్యూ లైన్లు, పొంగళ్ళు కొరకు చేయాల్సిన ఏర్పాట్ల గురించి అధికారులు వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గంగ జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుని ఏర్పాట్లు చేయాలని అన్నారు. దర్శనానికి అనుమతించే ధర్మ దర్శనం, ప్రత్యేక దర్శనం, విఐపి లు వెళ్ళే క్యూ లైన్లను పక్కగా చేయాలని అన్నారు. దర్శనానంతరం భక్తులు వెలుపలికి వెళ్ళే ర్యాంప్, క్యూ లైన్లను ఆర్ అండ్ బి అధికారులు తనిఖీ చేయాలని అన్నారు. భక్తులు ఆలయ ప్రదక్షిణ చేసే మార్గం ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తూ భక్తుల మధ్య తోపులాట జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఆలయంలోనూ, పరిసరాల్లో ఎప్పటికప్పుడు చెత్త తొలగించి, శుభ్రంగా ఉంచాలని హెల్త్ ఆఫీసర్ ను ఆదేశించారు. తుడా కార్యాలయంలో వి ఐ పి ల వాహనాలు పార్కింగ్ చేసుకునేలా ఏర్పాట్లు చేయాలని అన్నారు. మిగిలిన వాహనాలు లోనికి రాకుండా ట్రాఫిక్ కు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని పోలీసులకు సూచించారు. ఇందిరా మైదానంలో సాంస్క ృతిక ప్రదర్శనలకు అనువుగా ఏర్పాట్లు చేయాలని తుడా అధికారులను ఆదేశించారు. ఆలయం కు వెళ్ళే మార్గంలో ఉన్న దుకాణదారులు రోడ్లపైకి రాకుండా మార్కింగ్ చేయాలని ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. పొంగళ్ళు పెట్టే మార్కెట్ లో తగు ఏర్పాటు చేసి, నీరు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. అన్ని ఏర్పాట్లు సాయంత్రం లోపు పూర్తి చేయాలని అన్నారు. కమిషనర్ వెంట రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, ఆర్.సి. మునికృష్ణ, ఆర్డీవో రామ్మోహన్, ఏఎస్పీ రవి మనోహరాచారి, సూపరింటెండెంట్ ఇంజినీర్లు శ్యాంసుందర్, కృష్ణారెడ్డి, డి ఎస్పీ లు రామకృష్ణాచారి, భక్తవత్సలం, తుడా ఈ.ఈ.రవీంద్ర, మునిసిపల్ ఇంజనీర్ తులసి కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, తహసీల్దార్ భాగ్యలక్ష్మి, ఆలయ ఈ ఓ జయకుమార్, రెవెన్యూ ఆఫీసర్ సేతుమాధవ్, ఉత్సవ కమిటీ సభ్యులు మహేష్ యాదవ్, టిటిడి, తుడా , నగరపాలక సంస్థ, పోలీసు, ఫైర్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## జీవో నెంబర్ 77ను రద్దు చేయకుండా ఐసెట్ పరీక్ష నిర్వహిస్తే అడ్డుకుంటాం: ఏబీవీపీ



**జూపాడుబంగ్లా, మే 5 (మనం న్యూస్):** జీవో నెంబర్ 77 ను రద్దు చేయకుండా ఐసెట్ పరీక్ష నిర్వహిస్తే అడ్డుకుంటామని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఎబివిపి) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యుగంధర్ అన్నారు, సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం 2020 లో తీసుకువచ్చినటువంటి జీవో నెంబర్ 77 ప్రైవేట్ కళాశాలలో పీజీ విద్యను అభ్యసించాలి అనుకునే పేద విద్యార్థుల పాలిట శాపం గా తయారయ్యింది. ఆనాడు జీవో నెంబర్ 77 ఆమోదం లోకి వచ్చిన రోజు నుండి ప్రభుత్వానికి వ్యతిరేకంగా అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఎన్నో ఉద్యమాలను చేసి గత ప్రభుత్వ నాయకులకు నిద్ర లేకుండా చేసింది.అది అలా ఉంచితే ఎలక్షన్ కి ముందు నేటి విద్యాశాఖ మంత్రివర్యులు నారా లోకేష్ తాము ప్రభుత్వంలోకి వచ్చిన వెంటనే జీవో నెంబర్ 77 ను రద్దు చేస్తామని తాను చేసిన యువగలం పాదయాత్రలో చాలాసార్లు ప్రస్తావించారు. కాగా వారి ప్రభుత్వం వచ్చి 327 రోజులు గడిచినా ఇంకా జీవో నెంబర్ 77 గురించి పట్టించుకోకపోవడం వారికి విద్యార్థుల మీద ఉన్న చిత్తశుద్ధి అని అర్థమవుతుంది. అది అలా ఉంచితే 2025 మే నెల 7 వ తారీఖున ఐ సి ఈ టి ప్రవేశ పరీక్షలు జరగబోతున్నాయి. ఈ ఒక్క జీవో నెంబర్ 77 ను రద్దు చేయకుండా ఐ సి ఈ టి పరీక్షలు నిర్వహిస్తే ప్రైవేట్ కళాశాలలో ఎం బి ఏ, ఎం సి ఏ చదవాలనుకునే పేద విద్యార్థుల పరిస్థితి ఏంటి అని నేడు ప్రభుత్వాన్ని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నిలదీస్తుంది . ఐ సి ఈ టి పరీక్షలకు ముందే జీవో నెంబర్ 77 ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించాలి అని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. అలా రద్దు చేస్తున్నట్టు ప్రకటించకపోతే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎన్ని ఉద్యమాలు చెయ్యడానికి అయిన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ వెనకడుగు వెయ్యదని హెచ్చరిస్తున్నాము . విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జీవో నెంబర్ 77 ను రద్దు చెయ్యాలని అని యుగంధర్ డిమాండ్ చేశారు.

# శ్రీశైలం హుండీలో చోరీ

- చోరీకి పాల్పడిన ఇద్దరు మైనర్లు






**శ్రీశైలం మే 05(మనంన్యూస్):** శ్రీశైల మహాక్షేత్రంలో స్వామివారి గర్భాలయ హుండీ నుండి నగదు చోరీకి పాల్పడిన ఓ ముఠాను శ్రీశైలం పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్కు తరలించారు. సీఐప్రసాదరావు తెలిపిన వివరాల ప్రకారం వీపనగండ్ల మండలం వనపర్తి జిల్లాకు చెందిన సంగనమోని రమేష్ అనంతపురం జిల్లా ఉరవకొండకు చెందిన కే. లక్ష్మితో సహజీవనం చేస్తున్నాడు. ఇద్దరు పిల్లలు కలిగిన లక్ష్మితో కలిసి కొన్ని రోజులుగా శ్రీశైలం ప్రాంతంలోనే ఉంటున్నారు. ఈ క్రమంలో ఉచిత దర్శనం క్యూలైన్ ద్వార ఆలయ ప్రవేశం చేసిన వీరు 1వ తేదీన ఉదయం ప్రధానాలయంలోని రత్నగర్భ గణపతికి ముందు ఉన్న క్లాత్ హుండీ నుండి సుమారు 10 వేలకు పైగా డబ్బును దొంగలించారు. విషయం తెలుసుకున్న ఆలయ అధికారులు సీసీ కెమెరాల ద్వార బాలురు దొంగతనానికి పాల్పడినట్లు నిర్ధారించుకుని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులకు అనుమానాస్పదంగా ఉన్న వీరిని అదుపులోకి తీసుకుని విచారించగా గత కొన్ని రోజులుగా వీరు హుండీని దొంగిలంచే పనిలో ఉన్నట్లు.. ఇప్పటికి రెండు సార్లు హుండీ నుండి డబ్బు దొంగిలించినట్లు రమేష్, లక్ష్మిలు అంగీకరించినట్లు తెలిపారు. వీరి నుండి 10,150 రూపాయలను స్వాధీన పరుచుకుని రిమాండ్కు తరలించినట్లు సీఐ ప్రసాదరావు తెలిపారు.

**అధికారుల పర్యవేక్షణ... నిఘా నిర్లక్ష్యమే కారణం**

ప్రధానాలయంలో అధికారులు సిబ్బందికి మధ్య సమన్వయ లోపంతోపాటు నిఘా నిర్లక్ష్యం వల్లే దుండగులు ఈ ఘాతుకానికి పాల్పడ్డారని భక్తులు ఆరోపిస్తున్నారు. ఇద్దరు మైనర్ బాలురు హుండీని టార్గెట్ చేసి వరుస దొంగతనాలకు పాల్పడటం ఆలయ భద్రతా ప్రమాణాల లోపాలను సరిచేసుకోవాల్సిన అవసరం ఉందని అంటున్నారు.

## మాజీమంత్రి పేరుపై ప్రత్యేక పూజలు

**రంగారెడ్డి మే 5 (మనం న్యూస్):** మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే, మాజీ మంత్రి ు సబితా ఇంద్రారెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు అర్కల కామేష్ రెడ్డి ఆధ్వర్యంలో బాలాజీ దేవస్థానంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజ కార్యక్రమాల అనంతరం భారీ గజ మాలతో సబితా ఇంద్రారెడ్డి ని ఘనంగా సత్కరించారు. అనంతరం జరిగిన శుభాకాంక్షల సభ కోసం పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ప్రజలు సామ యాది రెడ్డి గార్డెన్ వైపు ప్రాంగణాన్ని మళ్లించారు. వేలాది మంది ప్రజలు పాల్గొన్న ఈ వేడుకల్లో అతిథులకు ఘన స్వాగతం పలికారు. సబితమ్మకు ప్రజల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. ఈ కార్యక్రమంలో సిద్దాల లావణ్య, బీరప్ప, భూపేష్ గౌడ్, అర్కల భూపాల్ రెడ్డి, బొక్క రాజేందర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, అనిల్ యాదవ్, సునీత బాలరాజ్, విజయలక్ష్మి, లలితా జగన్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# తడి,పొడి చెత్తపై అవగాహన



**కరీంనగర్ టౌన్, మే 5 (మనం న్యూస్):** ఇంట్లో ఉత్పత్తి అయిన చెత్తను మూడు డబ్బాల్లో వేరు చేసి డంపు యార్డుకు చెత్త పోకుండ చూడాలని కమీషనర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. కరీంనగర్ లో సోమవారం రోజు స్వచ్ఛ సర్వేక్షన్ లో భాగంగా నగరంలోని భగత్ నగర్, విద్యానగర్ ప్రాంతంలో పారిశుద్య విభాగం సిబ్బంది తో కలిసి పర్యటించారు. పారిశుద్య పనులను తనిఖీ చేసి పరిశీలించిపలు అపార్టు మెంట్లను సందర్శించారు. ఇంట్లో ఉత్పత్తి అయ్యే తడి పొడి చెత్తను వేరు చేసే ప్రక్రియ పై మహిళలను, అపార్ట్ మెంట్ ప్రజలను అవగాహన పరిచారు. చెత్తను మూరు రకాలుగా వేరు చేసేలా డబ్బాల ద్వారా ప్రాక్టికల్ గా చూపుంచి... అవగాహన కల్పించారు. డంపు యార్డు కు చెత్తను తగ్గించేలా ఇంట్లోనే చెత్తను వేరు చేసి డిస్పోజ్ చేసేలా ప్రతి ఒక్కరు చర్యలు తీసుకోవాలని సలహాలు సూచనలు చేశారు. చెత్తకు సెక్రిగేషన్ పద్దతులను పాటింటి.. సాధ్యమైనంత వరకు డంపు యార్డుకు చెత్తను తగ్గించాలని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా కమీషనర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ.... నగరంలో ఉన్న డంపు యార్డు పై ప్రత్యేక దృష్టి పెట్టామని పెట్టామన్నారు. డంపు యార్డుకు చెత్తను తగ్గించేందుకు పారిశుధ్యంలో చాలా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం చాలా వరకు డంపు యార్డుకు చెత్త వాహానాలు వెల్లకుండ చేస్తున్నట్లు తెలిపారు. తడి చెత్త ద్వారా కంపోస్టు ఎరువులు తయారు చేస్తున్నామని.... పొడి చెత్తను డిఆర్ సీసీ లకు తరలించి... వస్తువులను వేరు చేసి రీస్రైక్లింగ్ ప్రక్రియకు పంపండ జరుగుతుందని తెలిపారు. ఇలా చేయడం ద్వారా డంపు యార్డుకు చాలా వరకు చెత్త తగ్గుతుందని తెలిపారు. డంపు యార్డులో బయోమైనింగ్ ప్రక్రియను నిరంతరంగా కొనసాగిస్తున్నామని తెలిపారు. డంపు యార్డు చెత్తను ప్రక్షాలన చేసేందుకు చాలా రకాలుగా చర్యలు తీస్కుంటున్నట్లు తెలిపారు. స్థానిక ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని త్వరలో వేస్టు ఎనర్జీ ప్లాంటు ఏర్పాటు కు మరియు బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు కు ప్రణాళికలు వేస్తున్నట్లు తెలిపారు. బయోమైనింగ్ ప్రక్రియ ద్వారా ఇప్పటి వరకు దాదాపు లక్ష మెట్రిక్ టన్నుల చెత్త ప్రాసెస్ చేయడం జరిగిందని... కొత్తగా ఉత్పత్తి అయ్యే చెత్త భారిగా డంపు యార్డుకు తరలివెల్లడం ద్వారా బయోమైనింగ్ ప్రక్రియ ఆలస్యం అవుతుందన్నారు. డంపు యార్డు ప్రక్షాలన పైనే మా దృష్టి పెట్టామని తెలిపారు. ప్రజలు సాధ్యమైనంత వరకు ఇంట్లో చెత్తను సెక్రిగేషన్ చేసి... తడి చెత్తను హోం కంపోస్టు చేసి... పొడి చెత్తను డీఆర్ సీసీలకు తరలిస్తే డంపు యార్డుకు చాలా వరకు చెత్త తగ్గుతుందని తెలిపారు. ప్రజలు వంద శాతం సెక్రిగేషన్ పై దృష్టి పెట్టి చెత్తను వేరు చేసి నగరపాలక సంస్థ కు అందించాలని కోరారు. చెత్త సెక్రిగేషన్ పై నగర వ్యాప్తంగా ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా చెత్తను వేరు చేసి అందిస్తే... కరీంనగర్ నగరం రాబోయే రోజుల్లో చెత్త ఫీ నగరంగా మారుతుందని తెలిపారు.

## విద్యుత్ సబ్ స్టేషన్ కు ఎమ్మెల్యే భూమి పూజ

- రూ.3 కోట్ల రూపాయల వ్యయంతో భూమి పూజ చేసిన ఎమ్మెల్యే



**మద్దికేర, మే 4( మనం న్యూస్):** మద్దికేర మండల పరిధిలోని పెరవలి గ్రామ సమీపంలో రూ.3 కోట్ల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేస్తున్న నూతన విద్యుత్11/33కేవి సబ్ స్టేషన్ పత్తికొండ శాసనసభ్యులు కే.యి శ్యామ్ కుమార్, జిల్లా విద్యుత్ అధికారి ఉమాపతి లు సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా నిరంతరం విద్యుత్ సదుపాయం అందుబాటులో ఉంటుందని,రైతులకు ఎంతో మేలుకొరకంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు.పెరేవలి,ఏడవలి, బొమ్మనపల్లి, మదనంతపురం గ్రామాలకు చెందిన రైతన్నలకు లో వోల్టేజ్ సమస్యలతో పంట పొలాలు ఎండిపోతున్నాయని నా దృష్టికి రావడంతో ఆ సమస్య వెంటనే పరిష్కరించానని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఆగస్టు నెలలో విద్యుత్ సబ్టేషన్ పనులు పూర్తి చేసి రైతులకు విద్యుత్తు అందుబాటులో తీసుకొస్తామన్నారు.భూమి పూజ కార్యక్రమంలోమాజీ జెడ్పిటిసి పురుషోత్తం చౌదరి, పారా చిట్టెన్నా, విద్యుత్ అధికారులు, మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# గుర్తింపులేని పాఠశాలల్లో పిల్లలను చేర్పించొద్దు...



- కామారెడ్డి మండల విద్యాశాఖ అధికారి

**కామారెడ్డి, మే 05 ( మనంప్రతినిధి):** కామారెడ్డి పట్టణంలోని కొన్ని ప్రైవేట్ పాఠశాలలు గుర్తింపు లేకున్నా తమ పాఠశాలకు గుర్తింపు ఉందని చెప్పుకుంటూ విద్యార్థులను స్కూల్లో చేర్పించుకుంటున్నారని, విద్యార్థుల యొక్క తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించే ముందు ఆ పాఠశాలకు గుర్తింపు ఉందా లేదా సమాచారం తెలుసుకోవాల్సిన బాధ్యత విద్యార్థుల తల్లిదండ్రుల పైన ఉందని కామారెడ్డి మండల విద్యాశాఖ అధికారి ఎల్లయ్య అన్నారు. ఈ మేరకు సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తర్వాత విద్యార్థి భవిష్యత్తు చాలా బాధాకరంగా ఉంటుందని ఇట్టి విషయాన్ని విద్యార్థి తల్లిదండ్రులు గుర్తించాలని కోరారు, కామారెడ్డి పట్టణంలోని నారాయణ పాఠశాలకు ఇప్పటివరకు ఎలాంటి పర్మిషన్ ఇవ్వలేదని స్పష్టం చేశారు. అలాగే వివేకానంద టాపర్ ప్రైమరీ స్కూల్ రెండవ బ్రాంచ్కి కూడా ఎలాంటి పర్మిషన్ ఇవ్వలేదని, వివేకానంద టాపర్ హై స్కూల్లో ఉపాధ్యాయులచే పని చేయించుకొని వారికి వేతనాలు ఇవ్వడం లేదని తమ దృష్టికి వచ్చిందని, వెంటనే టాపర్ యజమాన్యం ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన వేతనం వెంటనే చెల్లించాలని లేనియెడల పాఠశాలపైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

# ప్రతి పక్ష నాయకులతో సైతం మన్ననలు పొందిన గొప్ప నేత...

- మాజీ ప్రధాని శత జయంతి ఉత్సవాలలో బీజేపీ రాష్ట్ర నాయకులు లోకా భూపతి రెడ్డి



**కామారెడ్డి టౌన్, మే 05 ( మనం న్యూస్ ):** భారతీయ జనతా పార్టీ కామారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో భారత రత్న, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయి శత జయంతి ఉత్సవాల సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు అధ్యక్షతన బీజేపీ జిల్లా కార్యాలయంలో విరాసత్ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన బీజేపీ రాష్ట్ర నాయకులు లోకా భూపతి రెడ్డి మాట్లాడుతూ., భారత రాజకీయాల్లో అజాత శత్రువుగా పేరొంది ప్రతి పక్ష నాయకులతో సైతం మన్ననలు పొందిన గొప్ప నేత అటల్జీ అని, ప్రతిపక్ష నాయకుడిగా ఉండి ఐక్యరాజ్య సమితిలో భారత దేశం తరుపున పాల్గొని అనర్గళంగా మాట్లాడారు అని, దాదాపు 28 రాజకీయ పార్టీలతో పూర్తికాలం సంకీర్ణ ప్రభుత్వం నడిపిన గొప్ప నాయకుడు అని, జాతీయ రహదారుల నిర్మాణం, గ్రామాలను అనుసంధానం చేస్తూ ప్రధాన మంత్రి సడక్ యోజన, రైల్వే వ్యవస్థ పటిష్టం వంటి సాహసోపేత నిర్ణయాల వల్ల వాటి ఫలితాలు ప్రస్తుత సమాజం పొందుతున్నామని అన్నారు. పాకిస్తాన్ తో కార్గిల్ యుద్ధం చేసి విజయం సాధించి సరియైన గుణపాఠం చెప్పారని గుర్తు చేశారు. భారతీయ జనతా పార్టీ 2 సీట్ల నుండి దేశం లోనే అత్యధిక సీట్లు పొంది, 17 రాష్ట్రాల్లో అధికారంలో కి వచ్చింది అంటే సిద్ధాంత పరంగా ఆ మహనీయుడు చూపిన బాట వల్లే సాధ్యం అయ్యింది అని అన్నారు. ప్రతి బీజేపీ కార్యకర్త అటల్జీ జీవితం గురించి పూర్తిగా తెలుసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అరుణా తార, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాణాల లక్ష్మారెడ్డి, రంజిత్ మోహన్, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి, రాము, నాయకులు మోటూరి శ్రీకాంత్, సంతోష్ రెడ్డి, వేణు, సురేష్, శ్రీనివాస్, రవీందర్, లక్ష్మీనారాయన తదితరులు పాల్గొన్నారు.



# ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి చర్యలు తీసుకోవాలి

- కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**కామారెడ్డి, మే 05 ( మనం జిల్లా ప్రతినిధి):** ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. భూముల సమస్యలు, రెండుపడక గదుల ఇళ్లు మంజూరు, రైతు భరోసా, ఫించన్లు మంజూరు తదితర అంశాలపై ఫిర్యాదులు అందాయి. ఈ రోజు ప్రజావాణి లో (96) ఫిర్యాదులు పలు శాఖలకు చెందినవి అందాయని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ., ప్రజావాణి లో వచ్చిన అర్జీలను పరిశీలించి సాధ్యా సాధ్యాల మేరకు సత్వర చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా పెండింగులో ఉన్న అర్జీలపై చర్యలు చేపట్టి దరఖాస్తు దారునికి సమాచారం అందించాలని తెలిపారు. ఈ ప్రజావాణిలో , స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, జడ్పీ సీఈవో చందర్, ఆర్డీఓ వీణ, పలు శాఖల అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# నిరుపేద అమ్మాయి పెళ్లికి అండగా నిలిచిన ఉప్పల శ్రీనివాస్ గుప్తా

- పుస్తె మట్టెలు అందజేత

**కామారెడ్డి, మే 05 ( మనం న్యూస్ ):** కామారెడ్డి జిల్లా రాజంపేట్ మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన మంద రాజమణి బాలయ్య కుమార్తె లావణ్య కు వివాహం ఉన్నందున నాగోల్ లోని ఉప్పల క్యాంపు కార్యాలయంలో వారికి టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ ఛైర్మెన్ అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త స్వప్న దంపతులు పుస్తే మట్టెలు, చీర గాజులు అందజేయడం జరిగిందని ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు తెలియజేశారు. ఈ సందర్భగా ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు మాట్లాడుతూ., మాట్లాడుతూ ఉప్పల శ్రీనివాస్ గుప్తా 53 వ జన్మదినం సందర్భంగా పుస్తె మట్టలను అందజేయడం జరిగిందని, వేలాది మంది పేదింటి ఆడబిడ్డల వివాహానికి పుస్తే మట్టెలు చీర, గాజులను అందజేయడం మానవతా దృక్పథానికి నిదర్శనం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు, కామారెడ్డి రక్తదాతల సమూహ అధ్యక్షులు జమీల్ హైమద్, ఉపాధ్యక్షులు వెంకటరమణ లు పాల్గొనడం జరిగింది.



## జాతీయం- అంతర్జాతీయం

# భారత్‌పై కుట్రలు చేస్తే.. పాక్‌ను తుడిచిపారేస్తాం



- మాజీ కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్

**సిమ్లా, మే 5:** పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాక్ సరిహద్దుల్లో భారత సైనికులపై కాల్పులు జరపడంతో పాటు ఇతర కవ్వింపు చర్యలకు పాల్పడుతుండడంపై కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ నేత అనురాగ్ ఠాకూర్ మండిపడ్డారు. దాయాది దేశం ఇదే విధంగా సరిహద్దుల్లో సమస్యలు సృష్టిస్తూ..భారత వ్యతిరేక కార్యకలాపాలను కొనసాగిస్తే ప్రపంచపటం నుంచి దానిని పూర్తిగా తుడిచిపారేస్తామని హెచ్చరించారు. ఉగ్రవాదాన్ని పోషిస్తున్నందుకు పాకిస్థాన్‌పై భారత ప్రభుత్వం ఇప్పటికే అనేక దౌత్యపరమైన చర్యలు తీసుకుందని..సరైన సమయంలో ఆ దేశానికి తగిన బుద్ధి చెబుతామని ప్రధాని మోడీ హామీ ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. హిమాచల్ ప్రదేశ్ బీజేపీ చీఫ్ రాజీవ్ బిందాల్ మాట్లాడుతూ..రాష్ట్రంలోని 17 చోట్ల నిరసనలు జరుగుతున్నాయని..కాబట్టి పాకిస్థానీయులను రాష్ట్రంలో ఉంచడం సరికాదని..కేంద్ర ప్రభుత్వ ఆదేశాల అనుసారం సిమ్లాలో నివసిస్తున్న పాకిస్థాన్ పౌరులను గుర్తించి వెంటనే వారిని తమ స్వదేశానికి పంపాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బీజేపీ నేతలు అక్కడి డిప్యూటీ కమిషనర్‌కు మెమోరాండం సమర్పించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో పాక్ పౌరులను గుర్తించడానికి అక్కడి ప్రభుత్వాలు ఎటువంటి చర్యలు తీసుకోవట్లేదని బిందాల్ విమర్శించారు. పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో భారత్‌ను వీడి వెళ్లాలని పాక్ జాతీయులను కేంద్ర ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో ఇప్పటి వరకు 786 మంది పాక్ పౌరులు దేశాన్ని వీడారు. వారిలో 55 మంది దౌత్యాధికారులు, వారి డిపెండెంట్లు, సహాయక సిబ్బంది, 8 మంది పాకిస్థాన్ వీసాలున్న భారతీయులున్నారు. గత 6 రోజుల్లో వారంతా అటారీ-వాఘా సరిహద్దు మీదుగా పాకిస్థాన్‌కు వెళ్లిపోయారు. పాకిస్థాన్ నుంచి భారత్‌కు 1,465 మంది వచ్చారు.

# భారత్-పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు చల్లారాలి

- పాకిస్థాన్‌లో పర్యటిస్తున్న ఇరాన్ మంత్రి అబ్బాస్ అరాగ్చీ




**ఇస్లామాబాద్, మే 5:** భారత్ పర్యటనకు ముందు ఇరాన్ విదేశాంగశాఖ మంత్రి అబ్బాస్ అరాగ్చీ పాకిస్థాన్‌లో పర్యటిస్తున్నారు. భారత్, పాక్‌ల మధ్య ఉద్రిక్తతలు చల్లారాలంటూ ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ వ్యాఖ్యానించారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్, పాకిస్థాన్‌లకు మధ్యవర్తిత్వం చేయడానికి తాను సిద్ధమని గతంలోనూ ఆయన ప్రకటించారు. సోమవారం పాకిస్థాన్‌లోఅడుగు పెట్టిన వెంటనే ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గించడానికి ప్రయత్నిస్తున్నాం. పాకిస్థాన్‌లోని స్నేహితులతో చర్చించనున్నాను. అలాగే అధ్యక్షుడు, ప్రధానమంత్రి, విదేశాంగ మంత్రితో భేటీ కానున్నాను. మా ఇరుదేశాల మధ్య ఉన్న ప్రాంతీయ సమస్యలు, ద్వైపాక్షిక సంబంధాలు సమీక్షించుకోనున్నాం" అని అబ్బాస్ వెల్లడించారు. ఇస్లామాబాద్‌లో చర్చల అనంతరం ఆయన ఈ వారం చివరల్లో భారత్‌కు రానున్నారు. ఇది ఎప్పుడో నిర్ణయమైన పర్యటన. వాస్తవంగా విదేశాంగ మంత్రుల సమక్షంలో భారత్-ఇరాన్ జాయింట్ కమిషన్ సమావేశం కోసం ఆయన మన దేశంలో పర్యటించాల్సి ఉంది. అయితే అది వాయిదా పడటంతో మే 7-8 తేదీల్లో దానిని నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. భారత్-పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో ఆదివారం పాక్ విదేశాంగ మంత్రి ఇషక్‌దార్‌కు రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ ఫోన్ చేశారు. రెండు దేశాలు ఆసక్తి చూపితే.. ఉగ్రదాడితో తలెత్తిన రాజకీయ క్లిష్ట పరిస్థితులను పరిష్కరించే దిశగా సహకారం అందిస్తామని చెప్పారు. పహల్గాంలోని బైసరన్ లోయలో ఏప్రిల్ 22న పర్యాటకులపై ఉగ్రవాదులు పాశవిక దాడి ఘటన తర్వాత పాక్ నడ్డివిరిచేలా భారత ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ ఉగ్రదాడి తర్వాత పీఎం మోడీకి ఇరాన్ ప్రధాని మసూద్ పెజెష్కియాన్ ఫోన్ చేసి, ఉగ్ర ఘటనను ఖండించిన సంగతి తెలిసిందే. కాగా...పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో మలేసియా పీఎం ఫోన్లో మాట్లాడారు. పాక్ ఎదుర్కొంటున్న క్లిష్ట పరిస్థితుల గురించి అవగాహన ఉందని, సాధ్యమైనంత తర్వగా ఉద్రిక్తతలు చల్లారాలని ఆశాభావం వ్యక్తంచేశారు. హింస ఏ రూపంలో ఉన్నా ఖండించాలని, బాధ్యులను గుర్తించడానికి పాదర్శక దర్యాప్తు ఉండాలన్నారు.ఉద్రిక్తతలతో పాక్ ఆర్థిక వ్యవస్థకు భారీ నష్టం: మూడీస్ న్యూయార్క్, మే 5: ప్రస్తుత ఉద్రిక్తతల ప్రభావం పాకిస్థాన్‌పై ప్రతికూలంగా ఉంటుందని ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ మూడీస్ పేర్కొంది. భారత్‌తో ఉద్రిక్తతలు కొనసాగితే అవి.. పాక్ ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీస్తాయని ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ మూడీస్ హెచ్చరించింది. ఈ మొత్తం వ్యవహారంలో భారత్‌తో పోల్చుకంటే అదే తీవ్రంగా నష్టపోతుందని విశ్లేషించింది. వృద్ధి రేటు మందగించడం.. నిధుల సేకరణకు పాక్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల్లో ఇబ్బందులు వంటివి తలెత్తుతాయని వెల్లడించింది. పాకిస్థాన్‌కు అప్పుల లభ్యత పరిమితమైపోవడంతోపాటు.. ఆ దేశ విదేశీ మారక ద్రవ్య నిల్వలు కరిగిపోతాయని మూడీస్ హెచ్చరించింది. ఇప్పుడు విదేశీ అప్పుల చెల్లింపులకు అవి సరిపోని పరిస్థితి నెలకొన్నట్లు వెల్లడించింది. ఈ పరిస్థితుల్లో కూడా ఆ దేశం ఐఎంఎఫ్ నిబంధనలు పాటించాల్సి ఉంటుందన్నారు. మరోవైపు భారత ఆర్థిక వ్యవస్థ బలంగానే ఉండటంతోపాటు.. స్థిరమైన వృద్ధిరేటును నమోదు చేస్తుందని వెల్లడించింది. దీనికి తోడు నాణ్యమైన ప్రభుత్వ వ్యయాలు, ప్రజల వినిమయ శక్తి చెప్పుకోదగ్గ స్థాయిలోనే ఉంటుందన్నారు. ప్రస్తుత ప్రాంతీయ ఉద్రిక్తతల ప్రభావం అతి స్వల్పంగానే ఉంటుందన్నారు. "భారత ఆర్థిక కార్యకలాపాల్లో పెద్దగా ఇబ్బందులు ఏమీ ఉంటాయని అనుకోము. ఎందుకంటే దానికి పాకిస్థాన్‌తో ఉన్న ఆర్థిక సంబంధాలు అతి తక్కువ. దాని మొత్తం ఎగుమతుల్లో ఇస్లామాబాద్‌కు వెళ్లేవి 0.5శాతం మాత్రమే. ఇక మా జియోపొలిటికల్ అంచనా ప్రకారం భారత్-పాక్ మధ్య పరిమిత స్థాయిలోనే సైనిక ప్రతిస్పందనలు ఉండొచ్చు. ఇక సమయాన్ని బట్టి అప్పుడప్పుడు ఇవి ఎగసిపడొచ్చు. ఇరుదేశాలకు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నుంచి ఇలానే జరుగుతోంది. అంతేకానీ, విస్తృత స్థాయి సైనిక ఘర్షణకు ఇవి దారితీయవు" అని పేర్కొంది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఇరు దేశాల సంబంధాలు అతి స్వల్పస్థాయికి పడిపోయాయి. పరస్పరం పోర్టుల్లోకి నౌకలను నిషేధించాయి.

# కెనడా నుంచి హిందువులను పంపించేయండి.. ఖలిస్థానీల దుష్ప్రచారం..!

**టొరొంటో, మే 5:** కెనడాలో ఖలిస్థానీల ఆగడాలు పెరిగిపోతున్నాయి. తాజాగా హిందువులను దేశం నుంచి వెనక్కి పంపాలంటూ విష ప్రచారం మొదలుపెట్టారు. కెనడాలో ఖలిస్థానీల దుశ్చర్యలు ఆగడం లేదు. తాజాగా ఆ దేశం నుంచి 8 లక్షల మంది హిందువులను వెనక్కి పంపించాలంటూ వేర్పాటువాదులు టొరొంటోలోని మాల్టన్ గురుద్వారాలో ఓ ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా వారు భారత ప్రధాని మోడీ, హోం మంత్రి అమిత్ షా, విదేశాంగ మంత్రి జై శంకర్ బొమ్మలను అభ్యంతరకర రీతిలో ఓ బోన్‌లో పెట్టి ప్రదర్శించారు. ఇటీవల ఖలిస్థానీ మద్దతుదారులు ఓ గురుద్వారా, మందిరంలో విధ్వంసం సృష్టించారు. ఆ తర్వాత ఈ కార్యక్రమం జరగడం గమనార్హం. కెనడాలోని హిందూ సమాజానికి చెందిన ఓ నాయకుడు షవన్ బిండా ఈ వీడియోను ఎక్స్‌లో పోస్టు చేశారు. "ఇది భారత ప్రభుత్వంపై చేస్తున్న ఆందోళన కాదు. ఖలిస్థానీ గ్రూపునకు ఉన్న హిందూ వ్యతిరేకత ఇది. కెనడాలో జరిగిన అతి భయంకరమైన దాడికి ఈ గ్రూపే కారణం" అని రాసుకొచ్చారు. ఆయన కనిష్కా బాంబింగ్ ఘటనను గుర్తు చేస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. కెనడాకు చెందిన విలేకరి డానియల్ బోర్డ్‌మన్ కూడా హిందూ వ్యతిరేకతను రెచ్చగొడుతూ ఖలిస్థానీలు నిర్వహించిన కార్యక్రమం వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. అంతేకాదు ఖలిస్థానీలపై చర్యలు తీసుకోవడంలో కొత్త ప్రధాని మార్క్ కార్నీకి.. మాజీ ప్రధాని ట్రూడోకు ఏమైనా తేడా ఉందా అని ప్రశ్నించారు.ఖలిస్థానీలు కేంద్ర మంత్రులను బెదిరించడం ఇదే తొలిసారి కాదు. ఇటీవల రైల్వేశాఖ సహాయమంత్రి రవనీత్ సింగ్ బిట్టూను హత్య చేయడానికి వారు కుట్రలు పన్నుతున్నారన్న ఆరోపణలు వచ్చాయి. ఈ విషయాన్ని స్వయంగా ఆయనే వెల్లడించారు. సామాజిక మాధ్యమాల్లో లీకైన కొన్ని స్క్రీన్ షాట్లు తన దృష్టికి వచ్చినట్లు పేర్కొన్నారు. కేంద్ర మంత్రి అమిత్‌షాపై కూడా ఖలిస్థానీ సంస్థ వారిస్ పంజాబ్‌దే నాయకులు కక్ష పెంచుకొన్నట్లు పేర్కొన్నారు.




## భారత్-పాక్ ఉద్రిక్తతలు



### మోడీకి కాల్ చేసిన రష్యా అధ్యక్షుడు పుతిన్

**మాస్కో, మే 5 :** భారత్-పాక్ ఉద్రిక్తల నేపథ్యంలో ప్రధాని నరేంద్రమోడీకి రష్యా అధ్యక్షుడు పుతిన్ కాల్ చేశారు. పహల్గాం ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారు. అలాగే ఉగ్రవాదంపై భారత్ జరుపుతోన్న పోరాటంలో తమ పూర్తిమద్దతు ఉంటుందని ప్రకటించారు. ఇరుదేశాల మధ్య ఉన్న ప్రత్యేక, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలపేతం చేసేందుకు కట్టుబడి ఉన్నామని మోడీ, పుతిన్ పునరుద్ఘాటించారు. మే 9న రష్యా విక్టరీ డేను నిర్వహించుకోనుంది. దీనిపై అధ్యక్షుడికి మోడీ శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే ఈ ఏడాది రెండుదేశాల మధ్య వార్షిక సదస్సు భారత్లో నిర్వహించనున్నారు. ఈ ఉద్రిక్తతల వేళ.. ఐరాస భద్రతామండలిలో సమావేశం జరగనుంది. ఈ నేపథ్యంలోనే పుతిన్ ఫోన్ చేశారు. ఇంతకుముందు పహల్గాం ఘటన తర్వాత రాష్ట్రపతి ద్రౌపదీముర్ము, ప్రధాని మోడీకి పుతిన్ లేఖ రాశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఇలాంటి క్రూరమైన నేరానికి ఎలాంటి సమర్థన లేదని పేర్కొన్నారు.

# పాకిస్థాన్‌కు నిధులు ఇవ్వొద్దు..

## ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్‌ను కోరిన భారత్..!



**ఫిలిప్పీన్స్,మే 5 :** ఉగ్రవాదానికి మద్దతిస్తున్న పాకిస్థాన్‌కకు నిధులు ఇవ్వొద్దని ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్‌కు భారత్ విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. పహల్గాం ఉగ్రదాడికి పాకిస్థాన్ సీమాంతర కుట్రే కారణమంటోన్న భారత్.. దాయాదికి గట్టిగా బుద్ధి చెప్పేందుకు కఠిన నిర్ణయాలు తీసుకుంటోంది. ముఖ్యంగా ఆర్థిక మూలాలను దెబ్బతీయడమే లక్ష్యంగా మరో చర్య చేపట్టింది. ఉగ్రవాదాన్ని ఎగదోస్తోన్న ఆ దేశానికి నిధులు ఇవ్వొద్దంటూ ఏషియన్ డెవలప్మెంట్ (ఏడీబీ)ను కోరినట్లు తెలుస్తోంది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. ఏడీబీ చీఫ్ మసాటో కాందతో ఇటీవల భేటీ అయినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఇదే విషయంపై ఇటలీ ఆర్థికమంత్రితో పాటు, పలు ఐరోపా దేశాల నేతలతోనూ నిర్మలమ్మ చర్చలు జరుపుతున్నట్లు సదరు వర్గాలు పేర్కొన్నాయి. ఇప్పటికే ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ గ్రేలిస్టులోకి పాకిస్థాన్‌ను తీసుకువచ్చేలా భారత్ ప్రయత్నిస్తోన్న సంగతి తెలిసిందే. ఇక, అంతర్జాతీయ ద్రవ్య నిధి నుంచి ఆ దేశానికి అందే 7 బిలియన్ డాలర్ల సాయంపైనా న్యూఢిల్లీ ఆందోళన వ్యక్తం చేయనుంది. తాజాగా ఏడీబీ నుంచి అందే నిధులను కూడా నిలిపివేయాలంటూ భారత్ అభ్యర్థన చేసినట్లు తెలుస్తోంది. న్యూఢిల్లీ అభ్యర్థనకు అంగీకరించి పాక్‌కు నిధులు నిలిపేస్తే ఇప్పటికే ఆర్థికంగా చతికిలపడిన ఆ దేశంపై మరో పిడుగు పడినట్లే..! ఇదిలా ఉంటే.. ప్రపంచ బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పరమేశ్వరన్ అయ్యర్కు అంతర్జాతీయ ద్రవ్యనిధిలో తాత్కాలిక విధులు నిర్వర్తించనున్నారు. ఐఎంఎఫ్ బోర్డులో భారత్ తరపున నామినీ డైరెక్టర్‌గా తాత్కాలిక బాధ్యతలు అప్పగించినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. మే 9న జరగనున్న సమావేశం నేపథ్యంలో ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. మూడేళ్ల కాలానికి 7 బిలియన్ డాలర్ల ప్యాకేజీ కోసం గత ఏడాది జులైలో ఐఎంఎఫ్-పాకిస్థాన్‌ల మధ్య ఒప్పందం ఖరారైంది. ఆ రోజున వివిధ అంశాలతో పాటు పాక్ బెయిలౌట్ ప్యాకేజీపై సమీక్ష జరగనుంది.



## వక్ఫ్ చట్టంపై 'సుప్రీం'లో పిటిషన్లు.. సీజేఐ కీలక నిర్ణయం

**ఢిల్లీ,మే 5 :** వక్ఫ్ (సవరణ) చట్టం-2025 రాజ్యాంగబద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సోమవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా సారథ్యంలోని ధర్మాసనం కీలక నిర్ణయం తీసుకుంది. వక్ఫ్ చట్ట సవరణను సవాల్ చేస్తూ దాఖలైన 72 పిటిషన్లపై విచారణను తదుపరి సీజేఐగా బాధ్యతలు చేపట్టనున్న జస్టిస్ బీఆర్ గవాయి సారథ్యంలోని ధర్మాసనం చేపడుతుందని స్పష్టం చేసింది. అనంతరం తదుపరి విచారణను మే 15కు వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ సంజీవ్ ఖన్నా వెల్లడించారు. ఈ వ్యవహారంపై మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడానికి ముందు సుదీర్ఘమైన విచారణ అవసరమని అభిప్రాయపడ్డారు.

# ఉద్రిక్తతలతో పాక్ ఆర్థిక వ్యవస్థకు భారీ నష్టం: మూడీస్



**న్యూయార్క్, మే 5:** ప్రస్తుత ఉద్రిక్తతల ప్రభావం పాకిస్థాన్‌పై ప్రతికూలంగా ఉంటుందని ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ మూడీస్ పేర్కొంది. భారత్‌తో ఉద్రిక్తతలు కొనసాగితే అవి.. పాక్ ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీస్తాయని ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ మూడీస్ హెచ్చరించింది. ఈ మొత్తం వ్యవహారంలో భారత్‌తో పోల్చుకంటే అదే తీవ్రంగా నష్టపోతుందని విశ్లేషించింది. వృద్ధి రేటు మందగించడం.. నిధుల సేకరణకు పాక్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల్లో ఇబ్బందులు వంటివి తలెత్తుతాయని వెల్లడించింది. పాకిస్థాన్‌కు అప్పుల లభ్యత పరిమితమైపోవ డంతోపాటు. ఆ దేశ విదేశీ మారక ద్రవ్య నిల్వలు కరిగిపోతాయని మూడీస్ హెచ్చరించింది. ఇప్పుడు విదేశీ అప్పుల చెల్లింపులకు అవి సరిపోని పరిస్థితి నెలకొన్నట్లు వెల్లడించింది. ఈ పరిస్థితుల్లో కూడా ఆ దేశం ఐఎంఎఫ్ నిబంధనలు పాటించాల్సి ఉంటుందన్నారు. మరోవైపు భారత ఆర్థిక వ్యవస్థ బలంగానే ఉండటంతోపాటు.. స్థిరమైన వృద్ధిరేటును నమోదు చేస్తుందని వెల్లడించింది. దీనికి తోడు నాణ్యమైన ప్రభుత్వ వ్యయాలు, ప్రజల వినిమయ శక్తి చెప్పుకోదగ్గ స్థాయిలోనే ఉంటుందన్నారు. ప్రస్తుత ప్రాంతీయ ఉద్రిక్తతల ప్రభావం అతి స్వల్పంగానే ఉంటుందన్నారు. "భారత ఆర్థిక కార్యకలాపాల్లో పెద్దగా ఇబ్బందులు ఏమీ ఉంటాయని అనుకోము. ఎందుకంటే దానికి పాకిస్థాన్‌తో ఉన్న ఆర్థిక సంబంధాలు అతి తక్కువ. దాని మొత్తం ఎగుమతుల్లో ఇస్లామాబాద్‌కు వెళ్లేవి 0.5శాతం మాత్రమే. ఇక మా జియోపొలిటికల్ అంచనా ప్రకారం భారత్-పాక్ మధ్య పరిమిత స్థాయిలోనే సైనిక ప్రతిస్పందనలు ఉండొచ్చు. ఇక సమయాన్ని బట్టి అప్పుడప్పుడు ఇవి ఎగసిపడొచ్చు. ఇరుదేశాలకు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నుంచి ఇలానే జరుగుతోంది. అంతేకానీ, విస్తృత స్థాయి సైనిక ఘర్షణకు ఇవి దారితీయవు" అని పేర్కొంది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఇరు దేశాల సంబంధాలు అతి స్వల్పస్థాయికి పడిపోయాయి. పరస్పరం పోర్టుల్లోకి నౌకలను నిషేధించాయి. ఎగుమతులు, దిగుమతులను నిలిపేశాయి.

## శాశ్వత అన్నప్రసాద పథకానికి విరాళం



శ్రీశైలం మే 5 (మనంన్యూస్): శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి నెల్లూరుకు చెందిన రామాంజనేయులు రూ. 1,00,116 /-లను విరాళాన్ని అందజేశారు. ఈ మొత్తాన్ని సహాయ కార్యనిర్వహణాధికారి జి. స్వాములుకు అందించగా దాతకు తగు రశీదు, ప్రసాదాలు, శేషవస్త్రం ఇచ్చారు.

## శ్రీశైలంలో సోమవార ప్రత్యేక పూజలు



- స్వామి అమ్మవార్లకు సహస్ర దీపాలంకరణ
- వైభవంగా వెండి రథోత్సవం

శ్రీశైలం మే 5 మనం న్యూస్: శ్రీశైల శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లకు సోమవారం సాయంత్రం శాస్త్ర దీపాలంకరణ మరియు వెండి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించినట్లు ఈవో శ్రీనివాసరావు తెలిపారు. ప్రదోష సమయంలో ఆలయ ప్రకారంలోని పురాతన దీపాలంకరణ మండపంలో శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఉయ్యాల్లో వేంచుంబ చేసి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం అర్చక వేద పండితులు వెయ్యి ఎనిమిది దీపాలను వెలిగించి శాస్త్ర దీపార్చన చేశారు. అనంతరం స్వామి అమ్మవార్లకు వెండి రథోత్సవంలో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి హారతులు ఇచ్చారు.

## బండమెట్ల సంతమార్కెట్ కబేల వేళాలు



- నగర కమిషనర్ హరిప్రసాద్

బేతంచేర్ల, మే5(మనం న్యూస్): పట్టణంలో నగర పంచాయతీకి సంబంధించిన రోజు వారం రోజు జరుగు సంత మార్కెట్ బండ్ల మెట్ట కబేల సంబంధించిన2025 2026 వరకు సంబంధించిన వేలం పాట నగర పంచాయతీ కార్యాలయంలో 1965 చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్ మున్సిపాలిటీ చట్టం లోని నియమ నిబంధన ప్రకారం ప్రభుత్వం ఆదేశాల మేరకు నియమ నిబంధనలతో వేలం నిర్వహిస్తున్నట్లు ఆసక్తి ఉన్నవారు మే 6 తేదీన ఉ,, 10 గ,,30 బహిరంగంగా నిర్వహిస్తున్న బండమెట్ట సంత మార్కెట్ కబేల రుసుం లు వసూలు చేయడానికి సంబంధించిన వాటి వేలం పాటలలో రుసుము చెల్లించి పాల్గొనవలసిందిగా నగర కమిషనర్ హరిప్రసాద్ తెలిపారు.

# సామాజిక న్యాయ దర్శానికుడు రాహుల్ గాంధీ




కర్నూలు మే 05మనం న్యూస్: కర్నూలు నంద్యాల చెక్పోస్ట్ సర్కిల్లో జాతీయ కాంగ్రెస్ పార్టీ ఏఐసిసి మాజీ అధ్యక్షులు లోకసభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన లక్ష్మీ నరసింహ యాదవ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాలాభిషేకం అనంతరం కాంగ్రెస్ పార్టీ నంద్యాల పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు మరియు ఏఐసిసి మెంబర్ లక్ష్మీ నరసింహ యాదవ్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ పోరాటం తోనే నరేంద్ర మోడీ కులగనన ప్రకటన చేశారు స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి ఈ దేశంలో కుక్కలకు నక్కలకు పులులకు చెట్లకు లెక్కలు ఉన్నాయి గాని దేశంలో 60% పైగా ఉన్నటువంటి బీసీల జనాభా లెక్కలు లేకపోవడం విద్య ఉద్యోగ రాజకీయ అన్ని రంగాల్లో ఓబీసీలకు తీవ్ర అన్యాయం జరిగింది. ఇది గమనించినటువంటి రాహుల్ గాంధీ గారు భారత్ జోడో యాత్రలో ఎంతోమంది ఓబీసీలను వారి యొక్క స్థితిగతులు తెలుసుకొని ఈ దేశంలో ఎవరి జనాభా ఎంత ఉంటే వారికి అంత వాట చెందాల్సిందే సామాజిక న్యాయం జరగాల్సిందే సామాజిక న్యాయం జరగాలంటే జనాభా లెక్కల్లో కుల గణన జరగాలి అని రాహుల్ గాంధీ గారు పోరాటం మొదలు పెట్టారు ఆ పోరాటంతో దిగివచ్చినటువంటి కేంద్రంలో బిజెపి ప్రభుత్వం క్యాబినెట్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం కానీ క్యాబినెట్ నిర్ణయానికి పరిమితం కాకుండా తక్షణమే కులగణన చేపట్టి విద్యా ఉద్యోగ రాజకీయ రంగాలలో బీసీలకు జనాభా తగ్గట్టు రిజర్వేషన్ కల్పించాలని లక్ష్మీ నరసింహ యాదవ్ డిమాండ్ చేశారు గతంలో బిజెపి నాయకులు నరేంద్ర మోడీ గారు కూడా కుల గణన చేయమని అడిగే ప్రతి ఒక్కరు అర్బన్ నక్సలైట్లుగా నరేంద్ర మోడీ గారు మాట్లాడారు కానీ రాహుల్ గాంధీ గారు మనిషికి ఎక్స్రే ఏ విధంగా తీస్తే జబ్బులు బయటపడతాయో ఈ దేశ జనాభాలో కులగనన చేపడితే ఏ రంగాల్లో ఎవరి వాటా ఎంత ఉందో బయటపడుతుంది తక్షణమే కులగరణ చేపట్టాలని చెప్పి రాహుల్ గాంధీ గారు పోరాటం చేశారు నిజంగా కేంద్రంలో బిజెపి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే కేంద్రంలో ఓబిసి మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి. 50% రిజర్వేషన్ పరిమితిని రద్దు చేయాలి ప్రైవేట్ రంగంలో కూడా రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు కాంగ్రెస్ పార్టీ అత్యున్నత సమావేశాలలో కూడా అహ్మదాబాద్ ఏఐసిసి ప్లీనరీలో కూడా బీసీ కులగలను మేము కట్టుబడి ఉన్నాము బీసీలకు సామాజిక న్యాయం జరగాలి జ్యుడీషియల్లో రాజకీయ రంగంలో పారిశ్రామిక రంగంలో బీసీల యొక్క వాటా చాలా తక్కువగా ఉంది వారి జనాభా తగ్గట్టు వారికి అన్ని రంగాల అభివృద్ధి చెందాలంటే కుల గణన చేయడమే ముఖ్యమని ఎన్నో పెద్ద పెద్ద సభలలో కూడా రాహుల్ గాంధీ గారు మాట్లాడి ఈరోజు సామాజిక న్యాయ దర్శనాయకుడుగా రాహుల్ గాంధీ గారు అని అభివర్ణించారు. కొంతమంది అవగాహన లేక ఇది ఓన్లీ బీసీలకే కులగలనా అని అనుకుంటున్నారు దేశవ్యాప్తంగా కులగనగా జరిగితే కమ్మ సామాజిక వర్గానికి ఎంత రిజర్వేషన్ ఇవ్వాలి రెడ్డి సామాజిక వర్గానికి ఎంత రిజర్వేషన్ ఇవ్వాలి వైశ్యాస్ కులానికి ఎంత రిజర్వేషన్ ఇవ్వాలి కాపు కులానికి ఎంత రిజర్వేషన్ ఇవ్వాలి బ్రాహ్మణ లకు ఎంత రిజర్వేషన్ ఇవ్వాలని తెలుతుంది కేంద్ర రాష్ట్రాలలో ఈడబ్ల్యుసి రిజర్వేషన్ ఎవరికి ఎంత రిజర్వేషన్ ఇవ్వాలో తెలియక వాటిలో కొంతమందికే ఆ రిజర్వేషన్ ఫలాలు పొందుతున్నారని ఈ కులగలను వల్ల అందరికీ న్యాయం జరుగుతుందని లక్ష్మీ నరసింహ యాదవ్ అన్నారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నంద్యాల పార్లమెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ రజాక్ వలి అసంఘటిత కార్మికుల జిల్లా అధ్యక్షుడు పఠాన్ హబీబ్ ఖాన్ నంద్యాల పార్లమెంట్ జిల్లా ఉపాధ్యక్షులు బాలస్వామి మైనార్టీ జిల్లా అధ్యక్షుడు జాకీర్ హుస్సేన్ కల్లూరు మండల అధ్యక్షుడు చెన్నయ్య ఓర్వకల్లు మండల అధ్యక్షుడ విశ్వేశ్వర్ రెడ్డి ఐ ఎన్ టి సి జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకన్న శేఖరు గోవిందు భాష ప్రతాపు నవీదు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం

- కర్నూలు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా
- 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమానికి 111 ఫిర్యాదులు



కర్నూలు మే 05మనం న్యూస్: కర్నూల్ కొత్తపేటలోని కర్నూల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు కర్నూలు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో అడిషనల్ ఎస్పీ మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 111 ఫిర్యాదులు వచ్చాయి.

**వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని...**

1) చెత్తబండి ఇప్పిస్తానని చెప్పి రూ. 3 లక్షల 30 వేలు తీసుకొని ధనుంజయ్, జానకీ రాముడులు మోసం చేశారని క్రిష్ణ గిరి మండలం, ఆలం కొండ గ్రామం కు చెందిన బంగారి ఫిర్యాదు చేశారు.

2) రూ. 2 లక్షల విలువ గల కంది పంటను నాశనం చేసి మా కుటుంబాన్ని మానసికంగా, ఆర్ధికంగా ఇబ్బందులకు గురి చేస్తున్న వారి పై చర్యలు తీసుకోవాలని ఓర్వకల్లు మండలం, లొద్ది పల్లె గ్రామానికి చెందిన మాల మాధమ్మ ఫిర్యాదు చేశారు.

3) 10 ఎకరాల ఆస్తి ని ఇద్దరు కొడుకులు పంచుకున్నారని , ఇచ్చిన పెన్సన్ డబ్బులు కూడా తీసుకుంటున్నారని నాకు జీవనాధారం కల్పించాలని ఆస్పరి మండలం, కైరుప్పల గ్రామానికి చెందిన అంగడిశివమ్మ ఫిర్యాదు చేశారు.

4) కర్నూలు, సంతోషనగర్ దగ్గర ఉన్న విజయనగర్ కాలనీలో మార్ట్ గేజ్ చేసిన ఒక ప్రాపర్టీని అమ్ముతామని చెప్పి కొందరు బ్రోకర్లు అడ్వాన్స్ గా డబ్బులు తీసుకొని చాలా మందికి మోసం చేస్తున్నారని కర్నూలు , బాలజీనగర్ కు చెందిన రహిమాన్ ఫిర్యాదు చేశారు.

5) నేను ఇన్ స్టా గ్రాంలో స్టాక్ మార్కెట్ గురించి ఒక ప్రకటన చూశాను. వాట్సాప్ గ్రూప్ లో లింకు ఇచ్చారు. ఇద్దరు వ్యక్తులు నాతో చాట్ చేసి ఒక యాప్ ఇచ్చి అకౌంట్ నంబర్ ఇచ్చి పెట్టిన పెట్టుబడికి లాభాలు చూపిస్తూ ఆ డబ్బులు ఇవ్వాలంటే ఇన్ కమ్ ట్యాక్స్ శాఖ ధృవీకరించడానికి పంపాలని చెప్పి మొత్తంగా రూ. 5 లక్షలు సైబర్ మోసానికి గురి చేశారని కర్నూలుకు చెందిన సునీత ఫిర్యాదు చేశారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా కర్నూలు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా హామీ ఇచ్చారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో సీఐలు శ్రీనివాస నాయక్, ఇబ్రహీం పాల్గొన్నారు.

## శ్రీ ఉరుకుంద ఈరన్న స్వామి నూతన అన్నదాన షెడ్ నిర్మాణం కొరకు విరాళం



కౌతాళం,మే 05 మనం న్యూస్ : శ్రీ నరసింహ ఈరన్న స్వామి దేవస్థాన నూతన అన్నదానం షెడ్ నిర్మాణం కొరకు బెంగళూరు వాస్తవ్యులైన కె. కృష్ణవేణి రూ.1,00,001/-ఆన్లైన్ పేమెంట్ ద్వారా డొనేషన్ కౌంటర్ నందు విరాళంగా చెల్లించియున్నారు. అధికారులు దాతలకు శ్రీ స్వామి దర్శనం,స్వామివారి శేష వస్త్రాము,లడ్డూ ప్రసాదాలు,ఆశీర్వాదాలు కల్పించి,బాండు పేపర్, పూలమాలతో సత్కరించారు.ఈకార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ జె వీరేష్ మరియు ప్రకాష్ స్వామి దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

## తుగ్గలి ఉపాధి హామీ పథకం ఈసిగా రాజశేఖర్



తుగ్గలి మే 5 (మనం న్యూస్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం తుగ్గలి మండల ఇన్చార్జి ( ఈసీ) గా రాజశేఖర్ ను నియమిస్తూ జిల్లా ఉన్నత అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. తుగ్గలి లో పనిచేస్తున్న ఈసి ప్రదీప్ కుమార్ ను పత్తికొండ మండలానికి బదిలీ పై వెళ్లడంతో ఇక్కడే పనిచేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్ రాజశేఖర్ కు అదనంగా నూతన ఇన్చార్జి ఈసి బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ మండలంలోని మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కూలీలకు సక్రమంగా సకాలంలో వేతనాలు అందే విధంగా చూస్తామన్నారు. అధికారుల సూచనలు, సలహామేరకు పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొస్తానని ఆయన పేర్కొన్నారు. అందరూ సహకరించాలని ఆయన కోరారు.

# 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్నదే మా ప్రభుత్వ లక్ష్యం..

## కర్నూలు జిల్లా గుట్టపాడు గ్రామంలో ఎంఎస్ఎంఈ పార్క్ ప్రారంభించిన మంత్రి టి.జి భరత్




కర్నూలు మే 05మనం న్యూస్: రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తున్నట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ అన్నారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలంలోని గుట్టపాడు గ్రామంలో ఎంఎస్ఎంఈ పార్కును ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డితో కలిసి రాష్ట్ర మంత్రి టి.జి భరత్ ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో 175 ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటుచేయాలని సీఎం చంద్రబాబు నాయుడు నిర్ణయించినట్లు చెప్పారు. దీని ద్వారా ప్రతి నియోజకవర్గంలో పరిశ్రమలు వస్తాయని.. తద్వారా స్థానికులకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వచ్చేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. స్థానికులకు ఉద్యోగాలు లభించేందుకు వీలుగా స్కిల్ డెవలప్ చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పరిశ్రమల్లో పనిచేసేందుకు కావాల్సిన నైపుణ్యాలు యువతకు అందిస్తామన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటుచేయాలన్న గొప్ప ఆలోచన సీఎం చంద్రబాబుకు వచ్చిందన్నారు. అప్పటి చంద్రబాబు విజన్తో ఇప్పుడు హైదరాబాద్ ఎంతో ఎదిగిపోయిందన్నారు. ఇప్పుడు సీఎం చంద్రబాబు నాయుడు ఆలోచనలు భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ను అభివృద్ధిలో ముందు వరుసలో ఉంచుతాయన్నారు. తమ కూటమి ప్రభుత్వం ఇలాగే కొనసాగితేనే ఇది సాధ్యమవుతుందన్నారు. ప్రజలందరూ తమపై నమ్మకం పెట్టుకోవాలని ఆయన చెప్పారు. ఓర్వకల్లు పారిశ్రామికవాడలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని తెలిపారు. దూపాడు నుండి బేతంచర్ల వరకు ఓర్వకల్లు నోడ్ మీదుగా రైల్వే సైడింగ్ కోసం ఇటీవల కేంద్ర రైల్వే మంత్రిని కలిసి వివరించానని మంత్రి టి.జి భరత్ తెలిపారు. అంతేకాకుండా పరిశ్రమలకు నీరు అందించడంతో పాటు ఇతర సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఇప్పటికే 14 వేల కోట్లతో సెమీ కండక్టర్ పరిశ్రమ ఓర్వకల్లులో పెట్టేందుకు ఒప్పందం కుదిరిందన్నారు. దీంతో పాటు ఓర్వకల్లు మొబిలిటీ వ్యాలీ ప్రాజెక్టు కూడా వచ్చిందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ కృషితోనే ఇదంతా సాధ్యమవుతుందన్నారు. ఓర్వకల్లులో జైరాజ్ ఇస్పాత్ స్టీల్ పరిశ్రమ గతంలో టిడిపి ప్రభుత్వం ఉన్నప్పుడే ప్రారంభమైందన్నారు. టిడిపి ప్రభుత్వం కొనసాగి ఉంటే ఈ సమయానికి పరిశ్రమ ఉత్పత్తి ప్రారంభమవ్వడంతో పాటు పరిశ్రమ విస్తరణ కూడా జరిగి ఉండేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటర్ పైప్ లైన్ వర్క్ పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. త్వరలో ఇది పూర్తవుతుందని తెలిపారు. తమ ప్రభుత్వం ఏర్పడిన 10 నెలల్లో 9 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని.. వీటి ద్వారా ఐదున్నర లక్షల మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, టిటిడి బోర్డు సభ్యులు మల్లెల రాజశేఖర్ గౌడ్, గుట్టపాడు సర్పంచ్ మోహన్ రెడ్డి, అధికారులు, పాల్గొన్నారు.

# ప్రపంచ చరిత్ర గమన నిర్దేశకుడు, కమ్యూనిస్ట్ ప్రణాళిక రూపకర్త కార్ల్ మార్క్స్

- ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎం రమేష్ బాబు



జూపాడుబంగ్లా మే 5 (మనం న్యూస్) ఆర్థికవేత్త, సామాజికవేత్త, పాత్రికేయుడు, సోషలిస్టు విప్లవకారుడు. ప్రస్తుత జర్మనీలోని ట్రయర్ పట్టణంలో ఓ మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన మార్క్స్, రాజకీయ ఆర్థికశాస్త్రం, హెగెలియన్ తత్త్వశాస్త్రం చదువుకున్నారని యుక్తవయస్సులో మారక్స్ ఏ దేశపు పౌరసత్వం లేని స్థితిలో, లండన్లో జీవితం గడిపాడని. లండన్లోనే మరో జర్మన్ ఆలోచనాపరుడైన ఫ్రెడరిక్ ఏంగెల్స్ తో కలిసి తన చింతన అభివృద్ధి చేసుకుంటూ, పలు పుస్తకాలు ప్రచురించాడని 1848 నాటి కరపత్రమైన కమ్యూనిస్ట్ మేనిఫెస్టో వాటన్నిటిలోకీ సుప్రసిద్ధమైందని తదుపరి కాలపు మేధో, ఆర్థిక, రాజకీయ చరిత్రను అతని రచన ప్రభావితం చేసిందని ప్రపంచ చరిత్ర గమన నిర్దేశకుడు, కమ్యూనిస్టు ప్రణాళిక రూపకర్త ప్రపంచ విప్లవ కారుడు మారక్స్ అని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎం. రమేష్ బాబు కొనియాడారు.. సోమవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో కార్లు మారక్స్ 207వ జయంతి కార్యక్రమాన్ని సిపిఐ ఆధ్వర్యంలో పూలమాలతో నివాళులర్పించి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు శ్రీరాములు, మాగబుల్ భాష, శీను, మధు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కారల్ మారక్స్ 207 జయంతి వేడుకలు



కర్నూలు మే 05మనం న్యూస్: ప్రపంచ మేధావి కమ్యూనిస్టు మహోపాధ్యాయ కారల్ మారక్స్ గారి 207 జయంతి సందర్భంగా సిపిఐ ఆధ్వర్యంలో స్థానిక సిఆర్ భవన్ నందు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి సిపిఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి రామచంద్రయ్య , జిల్లా కార్యదర్శి బి గిడ్డయ్య పాల్గొని ముందుగా కారల్ మారక్స్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా రామచంద్రయ్య మాట్లాడుతూ ప్రపంచంలోనే రాచరిక పాలన నుండి పెట్టుబడిదారుల కబంధహస్తాల నుండి కార్మిక రాజ్య స్థాపన ఏ విధంగా చేయాలో కార్మిక శక్తులు ఉపయోగించుకొని పెట్టుబడిదారులు ఏ విధంగా లాభాలు పొందుతున్నారో ప్రపంచ దేశాలకు కళ్లకు కట్టినట్టు తెలియజెప్పే విధంగా దాస్ క్యాపిటల్ రచించి కార్మిక రాజ్య స్థాపన కాంక్షించిన మహోన్నత వ్యక్తిని కొనియాడారు కారల్ మారక్స్ రచించిన గ్రంథాల ఆధారంగా రష్యాలో సోషలిస్టు రాజ్య స్థాపన సాధించడం జరిగిందని అంతటి గొప్ప మహనీయుని స్మరించుకోవడం ప్రపంచ మానవుల బాధ్యతాన్ని గుర్తు చేశారు నేడు ప్రపంచవ్యాప్తంగా నయా ఉదారవాదులు పెట్టుబడుదారులు విపరీతంగా పెరిగిపోతూ సంపద అంతా కొద్దిమంది చేతుల్లోనే పోగ అయితుందని దానికి వ్యతిరేకంగా కార్మికులందరూ కారల్ మారక్స్ చూపిన మార్గంలో రాజ్యాధికారం వైపుగా అడుగులు వేయాలని అప్పుడే ఆయనకు ఘనమైన నివ్వాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యవర్గ సభ్యులు నాగరాజు, కుమారు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె శ్రీనివాసులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి షాపిర్ భాష , విశాలాంధ్ర బ్రాంచ్ మేనేజర్ నాగరాజు ,ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి శ్రావణి, నగర అధ్యక్ష కార్యదర్శులు నాగేంద్రమ్మ, భారతి , నగరనాయకులు సులోచనమ్మ, మునెమ్మ, వెంకటేశ్వరమ్మ, సిపిఐ నగర నాయకులు రామాంజనేయులు, లింగప్ప, ప్రసాద్ , కళాఖర్ తదితరులు పాల్గొన్నారు.

# సభ్యత్వం కార్డు కార్యకర్త కుటుంబానికి ఒక భరోసా

## తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు పోలూరు శ్రీనివాసరెడ్డి



బేతంచేర్ల, మే 5(మనంన్యూస్): మండలపరిదిలో బలపాలపల్లె గ్రామంలోని శ్రీఆంజనేయస్వామి దేవాలయం దగ్గర తెలుగుదేశం పార్టీ నాయకులు ఆర్.ఈశ్వరయ్యఅధ్యక్షతన 226,227 బూత్ లలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వం నమోదు చేసుకున్న పార్టీ కార్యకర్తలకు సభ్యత్వం కార్డులు పంపిణీ చేయడం జరిగింది సభ్యత్వం కార్డు తెలుగుదేశం పార్టీ కార్యకర్తల కుటుంబానికి ఒక భరోసా అని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పోలూరు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు అనంతరం పోలూరు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ 1982 సంవత్సరంలో స్వర్గీయ నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించినప్పటి నుండి పార్టీ జెండా మోసే ప్రతి కార్యకర్త కుటుంబాలకు భరోసా కల్పించాలనే సదుద్దేశంతో సభ్యత్వ కార్యక్రమం తీసుకురావడం జరిగింది ఆనాడు నందమూరి తారక రామారావు ప్రవేశపెట్టిన సభ్యత్వం కార్డు ఈనాడు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబునాయుడు తెలుగుదేశం పార్టీ కార్యకర్త ఏదైనా ప్రమాదవశాత్తు మరణిస్తే ఆ కుటుంబానికి తెలుగుదేశం పార్టీ నిధి నుండి రూ 5,00,000/- లు బీమా రూపంలో అందించేలా చూస్తానని ప్రతి తెలుగుదేశం కార్యకర్తకు భరోసా ఇవ్వడం జరిగిందన్నారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పోలూరు నారాయణ మంత్రి కోటయ్య ముద్దవరం శేఖర్ గంగాధర్ సంకటి ఏకాంబరం ఉన్నం శేఖర్ బి.తిరుమలేష్,డి.మద్దిలేటి స్వామి విష్ణు డి.పొలయ్య దమ్ముంచి సుధాకర్ ఆర్.రాజు తదితర తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ఆర్థిక సంఖ్యాలో పాల్గొన్నారు.




# వర్షంతో రద్దైన మ్యాచ్..

ఐపీఎల్ 18లో భాగంగా సన్‌రైజర్స్ హైదరాబాద్-ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్ వర్షంతో రద్దు అయింది. దీంతో ఇరుజట్లకు చెరో పాయింట్ ఇచ్చారు. దీంతో హైదరాబాద్ ప్లే ఆఫ్స్ రేసు నుంచి వైదొలిగింది. తొలుత టాస్ ఓడి బౌలింగ్‌కు దిగిన ఢిల్లీ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 133 పరుగులు చేసింది. అశుతోష్ శర్మ (41), స్టబ్స్ (41) రాణించారు. ఇన్నింగ్స్ ముగిసిన అనంతరం వర్షం ప్రారంభం కావడంతో హైదరాబాద్ జట్టు బ్యాటింగ్‌కు దిగలేదు. వర్షం ఎక్కువగా కురవడంతో మైదానంలో భారీగా వర్షపు నీరు నిలిచింది. తర్వాత వరుణుడు శాంతించినప్పటికీ.. మైదానమంతా తడిగా మారడంతో మ్యాచ్ నిర్వహించేందుకు వీలు కుదరలేదు. దీంతో మ్యాచ్ రద్దు చేస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు.

ప్లే ఆఫ్స్ రేసు నుంచి ఔట్..

ఈ మ్యాచ్‌కు ముందు 10 మ్యాచ్‌ల్లో 3 విజయాలతో సాంకేతికంగానే ప్లే ఆఫ్స్ రేసులో ఉన్న హైదరాబాద్..



ఢిల్లీతో మ్యాచ్ రద్దు కావడంతో ఆ జట్టు ఆశలు ఆవిరయ్యాయి. ప్రస్తుతం హైదరాబాద్ ఖాతాలో 7 పాయింట్లే ఉన్నాయి. మిగతా మూడు మ్యాచుల్లో గెలిచినా 13 పాయింట్లే అవుతాయి. ఏ జట్టు అయినా ప్లే ఆఫ్స్‌కు వెళ్లాలంటే కనీసం 14 పాయింట్లతో పాటు ఇతర సమీకరణాలు కలిసొస్తేనే ముందంజ వేసే అవకాశం ఉంటుంది. మరోవైపు ఢిల్లీ ఖాతాలో ప్రస్తుతం 13 పాయింట్లు ఉన్నాయి. ఆజట్టుకు మరో మూడు మ్యాచ్‌లు మిగిలిఉన్నాయి. వాటిలో తప్పకుండా రెండు గెలిస్తేనే ఆజట్టు ప్లే ఆఫ్స్‌కు చేరే అవకాశం ఉంటుంది.

**తడబడిన ఢిల్లీ..**

తొలుత టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న హైదరాబాద్.. ఆరంభంలో ఢిల్లీ బ్యాటర్లను బెంబేలెత్తించింది. 29 పరుగులకే 5 కీలక వికెట్లను పడగొట్టింది. కరుణ్ నాయర్ (0), డుప్లెసిస్ (3), అభిషేక్ పోరెల్ (8)లను ఎస్‌ఆర్‌హెచ్ కెప్టెన్ కమిన్స్ తన వరుస ఓవర్లలో పెవిలియన్‌కు పంపించాడు. ఈ ముగ్గురూ వికెట్ కీపర్ ఇషాన్ కిషన్‌కే క్యాచ్ ఇచ్చి ఔటవడం గమనార్హం. తర్వాత వచ్చిన కేఎల్ రాహుల్ (10), అక్షర్ పటేల్ (6) సైతం నిరాశపరిచారు. ఉనద్కత్ బౌలింగ్‌లో రాహుల్.. ఇషాన్‌కే చిక్కగా, అక్షర్‌ని హర్షల్ వెనక్కి పంపాడు.

ఈ దశలో విప్రాజ్ నిగమ్ (18), స్టబ్స్ (41లి: 36 బంతుల్లో 4 ఫోర్లు) ఆదుకున్నారు. వీరిద్దరూ కుదురుకుంటున్న సమయంలో సమన్వయ లోపంతో విప్రాజ్ రనౌట్ అయ్యాడు. దీంతో 32 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. అనంతరం ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన అశుతోష్ శర్మ (41బీ 26 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), స్టబ్స్ ఢిల్లీ ఇన్నింగ్స్‌ను మళ్లీ గాడిలోపెట్టారు. ఏడో వికెట్‌కు వీరిద్దరూ 66 పరుగులు జోడించారు. ముఖ్యంగా అశుతోష్ బౌండరీలతో రెత్తించాడు. 19.4 ఓవర్ల వద్ద అశుతోష్ వెనుదిరిగాడు.

# చెన్నై సూపర్ కింగ్స్‌లోకి విధ్వంసకర వీరుడు




చెన్నై సూపర్ కింగ్స్‌లోకి కొత్త కుర్రాడు వచ్చాడు. గుజరాత్‌కు చెందిన వికెట్‌కీపర్ బ్యాటర్ ఉర్విల్ పటేల్‌ను రూ.30 లక్షల కనీస ధరకు జట్టులోకి తీసుకుంది. వంశ్ బేడీ స్థానంలో ఉర్విల్ పటేల్‌ను టీమ్‌లో చేర్చుకుంది. గాయం కారణంగా వంశ్ బేడీ ఈ సీజన్ లో మిగిలిన మ్యాచ్‌లకు దూరమైన సంగతి తెలిసిందే. 26 ఏళ్ల ఉర్విల్ పటేల్‌కు టీ20 క్రికెట్‌లో మంచి రికార్డు ఉంది. గతేడాది ముస్తాక్ అలీ ట్రోఫీలో త్రిపురపై 28 బంతుల్లోనే శతకం చేసి వార్తల్లో నిలిచాడు. 2023 విజయ్ హజారే ట్రోఫీలో 41 బంతుల్లో 100 పరుగులు చేశాడు. ఉర్విల్ 2023 ఐపీఎల్ సీజన్‌లో గుజరాత్ టైటాన్స్‌కు ప్రాతినిధ్యం వహించాడు. కానీ, ఒక్క మ్యాచ్‌లోనూ ఆడే ఛాన్స్ రాలేదు. ఇక, ప్రస్తుత సీజన్‌లో సీఎస్కే ఇప్పటివరకు 11 మ్యాచ్‌లు ఆడి రెండు విజయాలు మాత్రమే సాధించి ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించిన సంగతి తెలిసిందే.

**సన్‌రైజర్స్‌లోకి హర్ష్ దూబె**

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆటగాడు స్మరన్ రవిచంద్రన్ కూడా గాయం కారణంగా ఈ సీజన్‌లో మిగిలిన మ్యాచ్‌లకు దూరమయ్యాడు. ఈ క్రమంలో అతడి స్థానాన్ని సన్‌రైజర్స్ హర్ష్ దూబెతో భర్తీ చేసింది.

# ఈగో మంచిదే కానీ.. మంట పెరిగితే అన్నీ తగలబడిపోతాయి: పూరి జగన్నాథ్



ఈగో మంచిదే.. మన ఆత్మాభిమానాన్ని కాపాడుతుందని, కాకపోతే కొంత జాగ్రత్త వహించాలని అంటున్నారు ప్రముఖ దర్శకుడు పూరి జగన్నాథ్. 'పూరి మ్యూజింగ్స్' పేరుతో వివిధ అంశాలపై తన అభిప్రాయాలను పంచుకుంటున్న ఆయన.. తాజాగా 'ఈగో' అనే అంశంపై మాట్లాడారు.

''నా బ్రెయిన్‌లో ఉన్నది నేనే కదా అనుకుంటావ్. కానీ కాదు. నీ లోపల ఇంకొకడు ఉంటాడు. వాడి పేరు ఈగో. ఈ షో మొత్తం రన్ చేసేది వాడే. ఓవర్ థింకింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు వాడే సీఈవో. ఎవరైనా నీ మీద జోక్ వేస్తే వాడు అనవసరంగా హర్ట్ అవుతాడు. ఎక్కడ లేని కోపం వస్తుంది. కోపంలో వాడేదో నిర్ణయం తీసుకుంటాడు. అవతలవారితో ఎలా చర్చకు దిగాలి? అందులో మనది పై చేయి కావాలంటే ఏం మాట్లాడాలి అనే విషయంపై అనుక్షణం ట్రైనింగ్ ఇస్తుంటాడు. ప్రతి దానికి వాడికి కోపం వస్తుంటుంది. వాడెవడు మన కారు ఓవర్ టేక్ చేశాడు? మనకి ముందు చెప్పాలి కదా! భోజనం మనకు ముందు వడ్డించాలి కదా! మనల్ని ఎందుకు విష్ చేయాలి? ఇలా ప్రతి విషయానికి వాడికి కోపం వస్తుంటుంది.

సారీ చెప్పొద్దు.. చెబితే వీక్ అయిపోతావ్. నిన్ను నువ్వు తగ్గించుకోవద్దు నీ విలువ నీకు తెలియదు'' ఇలా ఎన్నో టిప్స్ చెబుతుంటాడు. వాడు చెప్పే లైఫ్ కోచింగ్ పాఠాలు తీసుకోవద్దు. చెల్లి పెళ్లికి రమ్మని మీ ఫ్రెండ్ పిలిస్తే వద్దురా 2017లో మీ అక్క పెళ్లికి వాడు రాలేదని చెబుతాడు. వీడికి పనికి మాలిన విషయాలు అన్నీ గుర్తుంటాయి. పెళ్లి జరిగితే అక్కడ కొట్టుకునేది మనుషులు కాదు. వాళ్లల్లో ఉన్న ఈగోలు. అలా అని మన ఈగోను తీసేయలేం. వాడు మన తోడబుట్టిన తమ్ముడు లాంటివాడు. మనతోనే ఉంటాడు. మన పక్కనే సోఫాలో కూర్చొని చిరాకుగా పాప్‌కార్న్ తింటుంటాడు. లోతుగా చూస్తే ఈ ఈగో బ్రదర్ చాలా మంచివాడు. మన ఆత్మాభిమానాన్ని కాపాడతాడు. మనం ఎవరి ముందు తలవంచకూడదు. తగ్గకూడదు అనేది వాడి కోరిక. మనల్ని కాపాడే కవచంలా ఉంటాడు కానీ, ఒక్కోసారి మనల్ని అమితంగా ఇష్టపడేవారిని కూడా ఏడిపిస్తాడు. ఎవరినైనా హర్ట్ చేసే సత్తా వాడికి ఉంది. వీడి వల్ల తల్లిదండ్రులు కూడా దూరమైపోతారు. కుటుంబసభ్యులు నీతో మాట్లాడటం మానేస్తారు. అందుకే మీలో ఉన్న ఈగోను దాచి పెట్టండి. ఈగోను దాచడం ఒక ఆర్ట్. దాయగలిగితే సగం గొడవలు తగ్గుతాయి. మనందరికీ అహం ఉంటుంది. అయితే అదొక జ్వాలలాగా చిన్నగా ఉంటే వెచ్చగా ఉంటుంది. మంట పెరిగితే చుట్టూ అన్నీ తగలబడిపోతాయి. టైమ్ బాగోలేనప్పుడు అన్ని వదిలేసి సైలెంట్‌గా కూర్చుంటాడు.

# బాలీవుడ్‌కి మీనాక్షి?



'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో ఈ ఏడాది ప్రారంభంలో మంచి హిట్‌ను తన ఖాతాలో వేసుకుంది అందాల తార మీనాక్షి చౌదరి. వరుస సినిమాలతో తెలుగు ప్రేక్షకులను మురిపిస్తోన్న ఈ భామ.. ఇప్పుడు బాలీవుడ్‌లో తన నటనను నిరూపించుకోవడానికి సిద్ధమైనట్లు తెలుస్తోంది. 'స్త్రీ', 'మిమీ' లాంటి హిట్ చిత్రాలను నిర్మించిన దినేశ్ విజన్ రూపొందిస్తున్న ఓ ప్రాజెక్టులో మీనాక్షి ప్రధాన పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం. ''దక్షిణాదిలో జోరు చూపిస్తున్న మీనాక్షి కోసం నిర్మాణ సంస్థ మడాక్ ఫిల్మ్స్ ప్రత్యేకంగా కథను సిద్ధం చేస్తుంది. యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా తీర్చిదిద్దుతున్న ఈ సినిమాలో ఆమె పాత్ర శక్తిమంతంగా ఉండనుంది. మీనాక్షి స్క్రీన్ ప్రెజెన్స్, నటనా సామర్థ్యాన్ని దష్టిలో పెట్టుకొని చిత్రబందం తనకు సరిగ్గా సరిపోయే హీరోను వెతికే పనిలో పడింది. మరికొన్ని రోజుల్లో ఈ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించనున్నార''ని మీనాక్షి సన్నిహిత వర్గాలు తెలిపాయి.

# మిస్ వరల్డ్ పోటీలను విజయవంతం చేద్దాం: మంచు లక్ష్మి



ప్రపంచ సుందరి పోటీలకు భాగ్యనగరం సిద్ధమవుతోంది. సుమారు మూడు వారాలపాటు నిర్వహించే ఈ పోటీల్లో 120 దేశాలకు చెందిన అందాల భామలు సందడి చేయనున్నారు. తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 10న గచ్చిబౌలి స్టేడియంలో పోటీలు ప్రారంభం కానున్నాయి. మే 31న ఫైనల్ జరగనుంది. ఈ సందర్భంగా ప్రభుత్వానికి, పోటీల్లో పాల్గొనే వారికి ఆల్ ది బెస్ట్ చెబుతూ సినీనటి మంచు లక్ష్మీ ఓ వీడియోను విడుదల చేశారు.

# వంద కోట్ల క్లబ్‌లో చేరిన 'హిట్ 3'



లేష్ కొలను దర్శకత్వంలో న్యాచురల్ స్టార్ నాని హీరోగా తెరకెక్కించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'హిట్ 3'. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. కేవలం నాలుగు రోజుల్లోనే ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ.101 కోట్ల గ్రాస్ కలెక్షన్లు సాధించినట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. అటు యూఎస్‌లోనూ ఈ సినిమా Ñ2 మిలియన్ల వసూలు చేసినట్లు మేకర్స్ క్లారిటీ ఇచ్చారు. నాని సినీ కెరీర్ లో 'దసరా, సరిపోతుందా శనివారం' తర్వాత అత్యంత వేగంగా రూ.100 కోట్లు వసూలు చేసిన సినిమాగా హిట్-3 నిలవడం విశేషం.ఇక ఈ సినిమాలో నాని పవర్‌ఫుల్ పర్ఫార్మెన్స్‌కు ప్రేక్షకులు ఫిదా అవుతున్నారు. ముఖ్యంగా అర్జున్ సర్కారుగా తన పాత్రలో నాని అద్భుతంగా నటించాడు. కీలక సన్నివేశాల్లో నాని అభినయం మొత్తం సినిమాకే మెయిన్ హైలైట్. శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాకు మిక్కీ జే మేయర్ సంగీతం అందించాడు. ఈ సినిమాను దర్శకుడు శైలేష్ కొలను డైరెక్ట్ చేయగా వాల్ పోస్టర్ సినిమా బ్యానర్ ప్రొడ్యూస్ చేసింది. మొత్తమ్మీద ఈ సినిమా భారీ విజయాన్నిసాధించింది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No:3-88, Gosala village, Penamaluru Mandal, Krishna District 521151(AP), And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.